ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

బుధవారం | 24-06- 2026 | సంపుటి: 17, సంచిక: 81, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

# చర్చలు సఫలం

## హైదరాబాద్ మెట్రో స్వాధీనం, విస్తరణకు గ్రీన్ సిగ్నల్..



**రెండు రోజుల పాటు కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి వరుస చర్చలు**

**సమగ్ర అధ్యయనం కోసం ఎస్‌బీఐ క్యాప్స్‌ను కన్సల్టెంట్‌గా ఎంపిక**

**రుణ సేకరణ, వ్యయ అంచనాలు, విస్తరణ ప్రణాళికలపై నివేదిక సిద్ధం**

హైదరాబాద్, జూన్ 23 (ప్రజాకలం) : హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి.. కేంద్రమంత్రులతో జరిపిన వరుస సమావేశాలు విజయవంతమయ్యాయి. మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్-2 విస్తరణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆటంకాలు ఈ చర్చలతో తొలగిపోయాయి.

**40 నిమిషాల పాటు సంయుక్త సమావేశం..**

మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్ (రైల్వే శాఖ), జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు.

**కన్సల్టెంట్‌గా 'SBICAPS' ఎంపిక.. విధివిధానాలు ఇవే..**

మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్ఠాత్మక ఆర్థిక సలహా సంస్థను SBICAPS

తరువాయి 2వ పేజీలో...

## హైదరాబాద్ మెట్రోపై రేవంత్ కన్ను..

### - రూ. 30 వేల కోట్ల ఆస్తుల దోపిడీకి కుట్ర
### - కేటీఆర్ తీవ్ర ధ్వజం



రంగారెడ్డి, జూన్ 23 (ప్రజాకలం) : హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టును వేదికగా చేసుకొని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలు కొత్త డ్రామాలకు తెరలేపారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల విస్తృత స్థాయిసమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీల వైఖరిపై ఆయన నిప్పులు చెరిగారు. రూ. 30 వేల కోట్ల కుంభకోణానికి కాంగ్రెస్ స్కెచ్ వేసిందన్నారు. దాదాపు 30 వేల కోట్ల రూపాయల విలువైన మెట్రో రైల్ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కన్ను పడిందని కేటీఆర్ ఆరోపించారు. ఈ భారీ ప్రభుత్వ ఆస్తులను తన కుటుంబ సభ్యులకు, అన్నదమ్ములకు, అనుచరులకు కట్టబెట్టేందుకు ఒక భారీ కుంభకోణానికి తెరలేపారని విమర్శించారు.మెట్రో రైల్ నిర్వహణ సంస్థ ఎల్ అండ్ టి అధికారులను బ్లాక్‌మెయిల్ చేసి, వారిని రాష్ట్రం నుంచితరిమేసేందుకు కుట్రలు చేశారు. ఎల్ అండ్ టి కి ఉన్న రూ. 14,000 కోట్ల అప్పు భారాన్ని ఇప్పుడు రాష్ట్ర ప్రజల నెత్తిన రుద్దేందుకు రేవంత్ రెడ్డి సిద్ధమయ్యారని కేటీఆర్ పేర్కొన్నారు.

తరువాయి 2వ పేజీలో...

## రఘునాధపాలెం గిరిజన గ్రామాలకు రూ.110 కోట్లు ఇవ్వండి

వరద నీటి కాలువల నిర్మాణానికి నిధుల కోసం విజ్ఞప్తి - 37 పంచాయతీల్లో 28 ఏజెన్సీ, గిరిజన గ్రామాలు - శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ

కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



2

## ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించాలి



**కేంద్ర మంత్రులను కలిసిన తుమ్మల, ఉత్తమ్**

**తెలంగాణ రైతాంగ ప్రయోజనాల కోసం కేంద్రానికి వినతులు**

**దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలి**

**తెలంగాణకు తక్షణమే డీఏపీ, యూరియా సరఫరా చేయాలి**

**పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోలుపై 25 శాతం పరిమితి ఎత్తివేయాలి**

**మొక్కజొన్న, జొన్నలను కేంద్రం MSPపై కొనుగోలు చేయాలి**

న్యూఢిల్లీ, జూన్ 23 (ప్రజాకలం) : తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,

తరువాయి 2వ పేజీలో...

## సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారు

### - మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు



భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 23 (ప్రజాకలం) : కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చిందని మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో సింగరేణి పూర్తిగా నిర్వీర్యం అవుతోందని, 137 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా ప్రస్తుతం అత్యంత దయనీయ స్థితికి చేరుకుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపెన్ కాస్ట్ ఓబీ (ఓవర్ బర్డెన్) టెండర్లలో భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని మండిపడ్డారు. సైట్ విజిట్ పేరుతో సరికొత్త నాటకానికి తెరలేపి, ఓబీ టెండర్లలో పెద్ద ఎత్తున గోల్‌మాల్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఉప ముఖ్యమంత్రి, భట్టి విక్రమార్క పాత్ర అత్యంత కీలకమని, ఆయన పర్యవేక్షణలోనే ఈ అక్రమాలు సాగాయని హరీశ్ రావు స్పష్టం చేశారు. ప్రస్తుతం సింగరేణిలో సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైపోవడంపై తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతోందని హరీశ్ రావు పేర్కొన్నారు. అంత పెద్ద మొత్తంలో మాయమైన బొగ్గు ఎక్కడ ఉందో యాజమాన్యం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దాదాపు రూ.1600 కోట్ల విలువైన బొగ్గును మాయం చేసి, దానికి పన్నులు ఎలా చెల్లించారో లెక్కలు తేలాల్సి ఉందన్నారు. అసలు తవ్వని బొగ్గుకు పన్నులు కట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని, ఏ ప్రాతిపదికన డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఒకప్పుడు లాభాల బాటలో పయనిస్తూ, కార్మికులకు అండగా నిలిచిన సింగరేణిని.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాల గనిగా మార్చేసిందని హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు.

తరువాయి 2వ పేజీలో...

## హర్మ్యూజ్‌ను తెరిచే ఉంచుతాం

### అవసరమైతే నిర్బంధానికి సిద్ధమే..!
### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హర్మ్యూజ్ జలసంధి విషయంలో తన వైఖరిని స్పష్టం చేశారు. అంతర్జాతీయ జల రవాణాలో కీలకమైన హర్మ్యూజ్ జలసంధిని తెరిచే ఉంచుతామని పేర్కొన్న ట్రంప్.. అవసరమైతే తమ నౌకా దళాలను మోహరించి.. దిగ్బంధిస్తామని ఇరాన్‌ను హెచ్చరించారు. ప్రస్తుతానికి హర్మ్యూజ్ బ్లాకేడ్‌పై తొందరపడడం లేదని, ఇరాన్ దారికి రాకుంటే నిర్బంధం తప్పదని ట్రంప్ తేల్చి చెప్పారు. హర్మ్యూజ్ జలసంధి మూసివేతపై సోషల్ మీడియా ట్రుత్ వేదికగా డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్‌తో చర్చలు ఫలవంతమయ్యేలా కనిపిస్తున్నందున తాను హర్మ్యూజ్‌ను తెరిచి ఉంచేందుకు అంగీకరించానని అమెరికా అధ్యక్షుడు తెలిపారు. 'హర్మ్యూజ్ జలసంధిని తెరిచి ఉంచేందుకు నేను అంగీకరించాను. ఇకపై నౌకలతో హర్మ్యూజ్‌ను దిగ్బంధించం. అదే సమయంలో మా నౌకలన్నీ బ్లాకేడ్‌కు సిద్ధంగా ఉన్నాయి. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో దిగ్బంధనం వద్దనిపిస్తోంది అని ట్రుత్ పోస్ట్‌లో పేర్కొన్న ట్రంప్.. అణ్వాయుధాల పరిశీలనకు ఇరాన్ పూర్తిగా అంగీకరించిందని వెల్లడించారు. ఒకవేళ టెహ్రాన్ తమ అణ్వాయుధాల పరిశీలనకు అనుమతించకుంటే చర్చలను నిలిపివేస్తామ'ని ట్రంప్ హెచ్చరించారు. ఓవైపు శాంతి చర్చలు జరుగుతుండగానే.. లెబనాన్‌పై ఇజ్రయేల్ దాడులకు ప్రతిచర్యగా హర్మ్యూజ్‌ను ఇరాన్ మూసివేసిన విషయం తెలిసిందే.

## కలం కౌంటర్




## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు
- సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

2

## ఏడు రకాల సన్న విత్తనాల సాగుతోనే బోనస్

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- యూరియా బుకింగ్ యాప్‌ను సమర్థవంతంగా వినియోగించాలి
- జిల్లాలో యూరియా కొరతకు తావులేదు
- ధర్మారం రైతు వేదికలో విత్తన మేళాను ప్రారంభించిన మంత్రి, జిల్లా కలెక్టర్



ధర్మారం, జూన్ 23 : ( ప్రజా కలం ప్రతినిధి ) పెద్దపల్లి జిల్లా ధర్మారం రైతు వేదిక లో మంగళవారం రోజున ఏడు రకాల సన్న విత్తనాల సాగు చేసిన రైతులకు మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన 500 రూపాయల బోనస్ వర్తిస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు ధర్మారం గ్రామ పంచాయతీ పరిధిలో రైతు వేదికలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రైతులను వరి సాగుతో పాటు ప్రత్యామ్నాయ పంటలు, సన్న రకాల వరి సాగు వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు రైతుల కు యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. యాప్‌లో ఏవైనా సమస్యలు తలెత్తితే స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుల కు సహకరిస్తారని చెప్పారు. రైతులకు యూరియా బుకింగ్ ప్రక్రియలో సహాయం చేయాలని పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు.

ప్రభుత్వం ఎంపిక చేసిన బీపీటీ-5204 (సాంబా మసూరి) ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-1638 (కూనారం సన్నాలు), డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి), జేఎన్ఎం-7715 / కేఎస్ఎం-7715 అనే ఏడు రకాల వరి వంగడాల సాగు చేసిన రైతులకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ అందజేస్తామని తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

# చర్చలు సఫలం

మొదటి పేజీ తరువాయి...

కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. ఫేజ్-1 వాల్యుయేషన్: ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ (వాల్యుయేషన్) రుణ సేకరణపై SBICAPS రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది.
ఫేజ్-2 నివేదిక: ఫేజ్-2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది? నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి? అనే అంశాలపై నివేదిక అందిస్తుంది.
ప్రభుత్వాలనిర్ణయం:ఈ కన్సల్టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు సంయుక్తంగా తదుపరి అడుగులు వేస్తాయి.

**ప్రక్రియను వేగవంతం చేసేందుకు 'సమన్వయ కమిటీ'**

కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణం గా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు.
ఈ కమిటీలో కేంద్రప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్‌లలో మార్పులు చేస్తూ, పనుల అనుమతుల ప్రక్రియను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2విస్తరణకు కేంద్రఆమోదం లభించడం సులభ తరంకానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవా ణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది.

# హైదరాబాద్ మెట్రోపై రేవంత్ కన్ను..

మొదటి పేజీ తరువాయి...

రేవంత్, కిషన్ రెడ్డిలది 'ఫ్రెండ్లీ మ్యాచ్' హైదరాబాద్ నగర అభివృద్ధి పట్ల కాంగ్రెస్, బీజేపీలకు ఎలాంటి చిత్తశుద్ధి లేదని కేటీఆర్ దుయ్యబట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన మెట్రో రైల్ విస్తరణ ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎందుకు ఆమోదం తెలపలేదో కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేసిన రేవంత్ రెడ్డిని, విస్తరణకు మోకాలడ్డిన కిషన్ రెడ్డిని హైదరాబాద్ ప్రజలు క్షమించరన్నారు. రేవంత్ రెడ్డికి తుగ్లక్, హిట్లర్ల ఆదర్శమని ఆయన ఎద్దేవా చేశారు.

**శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీపై నిప్పులు..**

బీఆర్ఎస్ కార్యకర్తల రక్తం, చెమట తో గెలిచిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ.. తన స్వార్థ ప్రయోజనాలు, అవినీతి అక్రమాలను కాపాడుకోవడానికే కాంగ్రెస్‌లోకి ఫిరాయించారని కేటీఆర్ మండిపడ్డారు.
బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి: గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క శేరిలింగంపల్లి నియో జకవర్గానికే రూ. 9,500 కోట్లు కేటాయించి అభివృద్ధి చేశామని, ఆ రోజే స్వయంగా గాంధీ ప్రగతి నివేదిక విడుదల చేశారని గుర్తుచేశారు.
రెండేళ్లలో ఏం చేశారు?: కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన ఈ రెండు సంవత్సరాలలో నియో జకవర్గానికి ఎమ్మెల్యే గాంధీ ఎన్ని నిధులు తెచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు ఎదురుచూపురాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన చూసి ప్రజలు విసిగిపోయారని కేటీఆర్ అన్నారు. క్యాలెండర్‌లో తేదీలు ఎప్పుడు మారుతాయా, కేసీఆర్ మళ్లీ ఎప్పుడు ముఖ్యమంత్రి అవుతారా అని తెలంగాణ ప్రజలంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. శేరిలింగంపల్లిలో మళ్లీ గులాబీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా కార్యకర్తలంతా కలిసికట్టుగా కదం తొక్కాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ సమావేశంలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీ పూర్ రాజు, స్థానిక బీఆర్ఎస్ ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు - సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



పెద్దపల్లి,జూన్ 23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని,వారికి సకాలంలో నాణ్యమైన విత్తనాలు,ఎరువులు అందించడమే తమ లక్ష్యమని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు.సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలోని రైతు వేదికలో వానకాలం సీజన్ సందర్భంగా నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతాంగ సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని,ఇచ్చిన మాట ప్రకారం సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా రూ.1,750 కోట్ల బోనస్ నిధులను ప్రభుత్వం కేటాయించగా,అందులో భాగంగా కేవలం పెద్దపల్లి నియోజకవర్గంలోని రైతుల ఖాతాల్లోకి రూ.88.40 కోట్ల బోనస్ సొమ్మును ఇప్పటికే జమ చేసినట్లు ఆయన వెల్లడించారు.సుల్తానాబాద్ మండల రైతులకు రూ.16.12 కోట్ల లబ్ధి చేకూరిందని,ఇందులో కాట్నపల్లికి రూ.62.91 లక్షలు,నర్సయ్యపల్లికి రూ.25.75 లక్షలు,బొంతకుంటపల్లికి రూ. 33.15 లక్షల చొప్పున నిధులు అందినట్లు వివరించారు.అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్, ఎగుమతి అవకాశాలను పరిగణనలోకి తీసుకుని,వ్యవసాయ నిపుణుల సబ్ కమిటీ సిఫార్సు చేసిన ఏడు రకాల సన్న వడ్ల సాగును మాత్రమే ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.సాంబ మసూరి,తెలంగాణ సోనా,హెచ్ఎంటి సోనా,జై శ్రీరామ్,కూనారం సన్నలు-1638,వరంగల్ 4444-సిద్ది, కేఎన్ఎం-7715 రకాలను మాత్రమే సాగు చేయాలని,ఈ రకాలను పండించే రైతులకు మాత్రమే ప్రభుత్వం పూర్తి బోనస్ అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు.రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి,సేంద్రీయ పద్ధతులపై మొగ్గు చూపాలని ఆయన రైతులకు సూచించారు.?విపక్షాల విమర్శలను తిప్పికొడుతూ గత ప్రభుత్వం రైతులను మోసం చేసిందని,కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధర లేకపోయినా మార్క్‌ఫెడ్ ద్వారా 15 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను రూ.2,400 మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచిందని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్,సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్,స్థానిక ప్రజాప్రతినిధులు,వ్యవసాయ అధికారులు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

### రఘునాథపాలెం గిరిజన గ్రామాలకు రూ.110 కోట్లు ఇవ్వండి

ఖమ్మం జూన్ 23(ప్రజా కలం న్యూస్)
ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గంలోని రఘునాథపాలెం మండలంలో ఏజెన్సీ, గిరిజన గ్రామ పంచాయతీలకు వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణం కోసం రూ.110 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. సోమవారం రాసిన ఈ లేఖలో మండలంలోని డ్రైనేజీ సమస్యలను మంత్రి వివరించారు.మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 28 ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు. వర్షాకాలంలో సరైన వరద నీటి కాలువలు లేక ఈ గ్రామాలు తీవ్ర నీటి నిల్వ, పారిశుధ్య సమస్యలను ఎదుర్కొంటున్నాయని, గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణానికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులకు రూ.110 కోట్లు అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ఈ నియోజకవర్గ పరిధిలోని ఈ గిరిజన ప్రాంతాలకు సరిపడా స్థానిక వనరులు లేనందున, గ్రామీణాభివృద్ధి లేదా గిరిజన ప్రాంత అభివృద్ధి పథకాల ద్వారా నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని తుమ్మల కోరారు.ప్రతిపాదిత పనులు ఈ గిరిజన ప్రాంతాల్లో పారిశుధ్యం, ప్రజారోగ్యం, జీవన పరిస్థితులు, మొత్తం మౌలిక సదుపాయాలను గణనీయంగా మెరుగుపరుస్తాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. డీపీఆర్‌తో పాటు గ్రామ పంచాయతీల జాబితాను లేఖకు జతచేస్తూ, నిధుల మంజూరుకు సానుకూలంగా స్పందించాలని కేంద్ర మంత్రిని ఆయన అభ్యర్థించారు.

# ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించాలి

మొదటి పేజీ తరువాయి...

ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ, దేశీయ వంటనూనెల ఉత్పత్తి పెంపుపై విస్తృతంగా చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్ పామ్ లక్ష్యాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికిపైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భారత్ ప్రస్తుతం వంటనూనెల అవసరాల్లో దాదాపు 60 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన చీవీజూ-త్రా కార్యక్రమం దేశ ఆర్థిక వ్యవస్థకు, రైతాంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే ఇటీవల క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 44 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశాల నుంచి చౌక ధరలకు పామాయిల్ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్లో ధరలు పడిపోతున్నాయని, దీనివల్ల ఆయిల్ పామ్ రైతులు ఉత్పత్తి చేస్తున్న ఫ్రెష్ ఫ్రూట్ బంచ్ లకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు. దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్ సాగుకు రైతులు భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ధరల అనిశ్చితి రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. దిగుమతి సుంకాన్ని తిరిగి 44 శాతానికి పెంచడం ద్వారా దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆత్మనిర్భర్ భారత్, ఎడిబుల్ ఆయిల్ స్వయం సమృద్ధి లక్ష్యాలు కూడా సాధ్యమవుతాయని మంత్రులు పేర్కొన్నారు. అలాగే ఆయిల్ పామ్ రైతులకు కనీస గ్యారంటీ ధర విధానాన్ని అమలు చేసే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించాలని కోరారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆయిల్ పామ్ రైతుల భవిష్యత్తు దృష్ట్యా దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించి రైతులకు భరోసా కల్పించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మంత్రులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ రైతాంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్రంలో ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో డి.ఎ.పి, యూరియా ఎరువుల అవసరం గణనీయంగా పెరిగిందని, కేంద్రం కేటాయించిన కోటాకు మరియు వాస్తవ సరఫరాకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వెంటనే పూడ్చి, రాష్ట్రానికి పూర్తి స్థాయిలో ఎరువులు అందించాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఎరువుల సరఫరాను నిరంతరాయంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోళ్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం పరిమితి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన మొత్తం పంటను కనీస మద్దతు ధర కింద కొనుగోలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుని ఆ పరిమితిని పూర్తిగా తొలగించాలని కోరారు. దీంతో పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు దేశ ఆహార భద్రత, దిగుమతుల తగ్గింపుకు కూడా దోహదపడుతుందని వివరించారు.
ఈ ఏడాది తెలంగాణలో రికార్డు స్థాయిలో సుమారు 15 లక్షల టన్నుల మొక్కజొన్న, 3 లక్షల టన్నుల జొన్నల ఉత్పత్తి నమోదైందని, మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే దిగువకు పడిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భారీ ఆర్థిక భారం భరించి మొక్కజొన్న, జొన్నలను కొనుగోలు చేసిందని, ఈ పంటలను కూడా కేంద్ర ప్రభుత్వ కొనుగోలు విధానంలో చేర్చి మీఫ్రాపై సేకరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రసాయనాలు-ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు తెలంగాణలో ఎరువుల సరఫరా, పోషకాధారిత ఎరువుల సబ్సిడీ విధానంలో మార్పులకు సంబంధించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల పలు లేఖలు రాయగా... ఈ వినతులపై స్పందించిన కేంద్ర మంత్రి తెలంగాణలో యూరియా, డి.ఎ.పి. తదితర ఎరువుల లభ్యత, సరఫరాపై కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, రాష్ట్ర రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని శాఖ అధికారులను ఆదేశించినట్లు తన లేఖలో పేర్కొన్నారు.

# ఏడు రకాల సన్న విత్తనాల సాగుతోనే బోనస్

మొదటి పేజీ తరువాయి...

ఈ వంగడాలపై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గత సీజన్‌లో వరి, మొక్క జొన్న కొనుగోళ్లు రికార్డు స్థాయిలో నిర్వహించామని కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శించి రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించా మని తెలిపారు. జిల్లా కలెక్టర్ సమన్వయంతో అన్ని శాఖల అధికారులు సమర్థంగా పని చేయడంతో ఒక్క రైతుకూ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారని పేర్కొంటూ కలెక్టర్ కోయ శ్రీహర్షను అభినందించారు. జిల్లాలో యూరియా కొరత లేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యూరియాను సమర్థవంతంగా వినియో గించేందుకు ప్రభుత్వం యాప్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. 4 వేల కోట్ల రూపాయల నష్టం వచ్చిన పుటికీ మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. ధర్మారం మండలంలో 45 వేల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రెండు రోజుల్లోనే చెల్లింపులు జమ చేసినట్లు తెలిపారు. ప్రభు త్వం గుర్తించిన ఏడు రకాల విత్తనాల అవసరమైన నిల్వలను అన్ని దుకాణాల్లో అందుబాటులో ఉంచినట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. రైతు లంతా ఈ ఏడు రకాల



వంగడాలనే సాగు చేసి బోనస్ పొందాలని కోరారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గత 45 రోజుల వ్యవధిలో ధర్మారం మండలంలోనే 45 వేల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు జరిగిందని గత ఐదేళ్లలో ఇదే అత్యధిక కొనుగోలు అని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో మొత్తం రూ.1,100 కోట్ల విలువైన వరి కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. యూరియా నిల్వలపై అపోహలు అవసరం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఖరీఫ్-2026కు జిల్లాకు మొత్తం 26 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని, ప్రస్తుతం 21 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు అందు బాటులో ఉన్నాయని మరో 15 రోజుల్లో అదనంగా 5 వేల మెట్రిక్ టన్నులు చేరనున్నాయని తెలిపారు. జూన్ 20 నుంచి యూరియా బుకింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ఎక్కడా ఎలాంటి సమస్యలు ఎదురుకాలేదని చెప్పారు. యాప్ ద్వారా బుకింగ్ చేయడం వల్ల యూరియా నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించ వచ్చని రైతులు క్యూలలో నిలబడాల్సిన అవసరం ఉండదని వివరించారు. యాప్ ద్వారానే యూరియా పంపిణీ చేయాలని డీలర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇతర మార్గాల్లో యూరియా కొనుగోలు చేయవద్దని రైతులకు సూచించారు. గత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రూ.130 కోట్ల బోనస్ అందించామని ఈసారి కూడా ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు రకాల వంగడాల సాగు చేసిన రైతులకే బోనస్ వర్తిస్తుందని తెలిపారు. జిల్లా లో యూరియా సమృద్ధిగా అందుబాటు లో ఉందని అవసరానికి మించి కొను గోళ్లు చేసి ఆందోళన చెంద వద్దనిసూచించారు.యూరియాబుకింగ్‌లో ఏవైనా సమస్యలు ఎదురైతే వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తి సహకారం అందిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్ల నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, ఏసిపి జి. కృష్ణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

### కొలీజియం ఎంపిక ప్రక్రియపై

# సుప్రీం సంచలన తీర్పు

## న్యాయమూర్తుల ఎంపిక విధానం న్యాయ సమీక్షకు అతీతం

## కొలీజియం స్వతంత్రతను కాపాడేందుకే ఈ నిర్ణయం: సుప్రీం



న్యూఢిల్లీ, జూన్ 23 :
: కొలీజియం ఎంపిక ప్రక్రియపై సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. న్యాయమూర్తుల ఎంపిక విధానం న్యాయ సమీక్షకు అతీతమని దేశంలోని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జడ్జీల నియామక ప్రక్రియ సమాచార హక్కు చట్టం కిందకు రాదని తేల్చి చెప్పింది. ఈ మేరకు మంగళవారం జస్టిస్ బి.వి. నాగరత్నతో కూడిన ధర్మాసనం వెల్లడిం చింది. ఈ సందర్భంగా హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన సీనియర్ జ్యూడీషియల్ అధికారి దాఖలు చేసిన పిటిషన్‌ను ఈ ధర్మాసనం కొట్టేసింది. కొలీజియం నిర్ణయాల్లో జోక్యం చేసుకుని కొత్త సమస్యలను కొనితెచ్చుకోలేమని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. జడ్జీల ఎంపిక అనేది పూర్తిగా కొలీజియం అంతర్గత సంతృప్తిపైనే ఆధారపడి ఉంటుందని తెలిపింది. కేవలం సీనియార్టీ ఉన్నంత మాత్రాన హైకోర్టు జడ్జీగా పదోన్నతి పొందే హక్కు ఎవరికీ లభించదని కుండబద్దలు కొట్టింది. కొలీజియం దృష్టిలో అభ్యర్థి యొక్క 'యోగ్యతతోపాటు అర్హత' మాత్రమే అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశమని ధర్మాసనం పేర్కొంది. సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదం తెలిపిన తర్వాత.. దానిపై న్యాయ పరంగా మళ్లీ చర్చలు లేదా వాదనలు జరపడానికి వీల్లేదని కరాఖండిగా చెప్పింది. తనకంటే జూనియర్లకు పదోన్నతి కల్పించారంటూ హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన అధికారి చేసిన అభ్యర్థనను ఈ సందర్భంగా ధర్మాసనం తోసిపుచ్చింది. కొలీజియం వ్యవస్థ యొక్క స్వతంత్రతను కాపాడేందుకే ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు జస్టిస్ బి.వి. నాగరత్నతో కూడిన ధర్మాసనం స్పష్టంగా వివరించింది.

### పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతర

# నీటి సరఫరా ఉండాలి

## అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై మంత్రి సీతక్క సమీక్ష



హైదరాబాద్, జూన్ 23 (ప్రజాకలం) :
గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలపై మంత్రి సీతక్క రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలతో మంత్రి సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష చేశారు. ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, జీపీ కార్యాలయాల నిర్మాణాలపై సమీక్షించారు. జల సంరక్షణ పనులు, చెక్‌డ్యాంల నిర్మాణాలపై అధికారులతో మంత్రి చర్చలు జరిపారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎమ్‌కేఎస్‌వై) పనుల అమలుపై మంత్రి సమీక్ష జరిపారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరుపై సీతక్క ఆరా తీశారు. పారిశుధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై చర్చించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపైనా సమీక్ష చేశారు. స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాల సాధనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతర నీటి సరఫరా ఉండాలని సీతక్క ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులపై పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. మహిళా సంఘాల బలోపేతం, బ్యాంక్ లింకేజీల పెంపుపై సెర్ప్‌తో చర్చించారు. మహిళల జీవనోపాధి అవకాశాల విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రతి పథకం అమలు కావాలని ఆదేశాలు జారీ చేశారు.

# సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారు

మొదటి పేజీ తరువాయి...

ఈ అక్రమాల వెనుక అధికార పక్షానికి చెందిన పెద్దల హస్తం ఉందన్న ఆయన.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంధువులకు చెందిన శోధ కంపెనీ సైతం ఈ ఓబీ అక్రమాల్లో భాగస్వామిగా మారిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. సంస్థను లాభాల బాటలో నడిపించాల్సింది పోయి, సింగరేణి థర్మల్ ప్రాజెక్టును కూడా క్రమంగా నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోం..**

సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ఇందిరమ్మ రాజ్యమంటూనే పేదల ఇళ్లు కూలగొడుతోందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వమైనా పేదలకు అండగా నిలిచి వాళ్లకు గూడు కట్టి స్తుందని తెలిపారు. రెవెన్యూ మంత్రి హ యాంలో పేదల ఇళ్లు లాక్కోవడం దుర్మార్గ మని పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లాలో హరీశ్‌రావు పర్యటించి, పలు కార్యక్ర మాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఖమ్మం కలెక్టర్‌తో మాట్లాడి పేదల గూడు లాకుంటే ఊరుకో మని చెప్పామని అన్నారు.ఎవరి స్థలాలు అయితే లాక్కున్నారో.. వారికి వెంటనే స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టివ్వాలని డిమాండ్ చేశారు.

**జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి..**

ఖమ్మంలో జర్నలిస్టులకు తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఖమ్మంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే తానే పోరాడుతానని స్పష్టం చేశారు. తాను దగ్గరుండి ఖమ్మం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని భరోసా కల్పించారు. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారని అన్నారు. మరి ఖమ్మం జర్నలిస్టులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. ఖమ్మం జర్నలిస్టుల కు ఎందుకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం లేదని నిలదీశారు.

**రేవంత్‌రెడ్డి పాలనంత బ్లాక్‌మెయిల్..**

ఖమ్మంలో పేదల ఇళ్లు లాక్కుంటే చూస్తూ ఊరుకోమని.. ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి తనకు హిట్లర్ ఆదర్శమని చెప్పి హైడ్రా పెట్టారని ఎద్దేవా చేశారు. ఆయనకు కళ్లు నెత్తికెక్కాయని.. అహంకా రాన్ని ప్రదర్శించే వాళ్లే హిట్లర్‌ని ఆదర్శంగా తీసుకుంటా రని ధ్వజమెత్తారు.

## జగిత్యాలకు బైపాస్ రోడ్డు - అంతర్గాం, అంబారీపేట వద్ద
# అండర్‌పాస్‌లకు కేంద్ర ఆమోదం



జగిత్యాల ప్రతినిధి జూన్ 23 (ప్రజాకలం): జగిత్యాల జిల్లా ప్రజలకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించిందని ధర్మపురి అరవింద్ తెలిపారు. జగిత్యాల--కరీంనగర్ జాతీయ రహదారి అభివృద్ధి పనుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. జగిత్యాల--కరీంనగర్ ఎన్ హెచ్ -563 రహదారిని నాలుగు లేన్లగా విస్తరించడంతో పాటు, జగిత్యాల పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఎంపీ పేర్కొన్నారు. అలాగే అంతర్గాం, అంబారీపేట గ్రామాల వద్ద ప్రజల రాకపోకలకు అనుకూలంగా అండర్‌పాస్‌ల నిర్మాణానికి కూడా గ్రీన్ సిగ్నల్ లభించినట్లు వెల్లడించారు. ఈ అంశంపై తాను కేంద్ర రహదారులు, రవాణా శాఖ దృష్టికి తీసుకెళ్లగా, కేంద్ర రహదారులు మరియు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా లేఖ ద్వారా సమాచారం అందించినట్లు ఎంపీ అర్వింద్ తెలిపారు. బైపాస్ రోడ్డు, అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తయితే జగిత్యాల పట్టణంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణికులకు సురక్షితమైన, వేగవంతమైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. జగిత్యాల జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను తీసుకురావడానికి కృషి కొనసాగిస్తానని ఎంపీ అర్వింద్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజల తరఫున కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## - అబ్బాపూర్ గ్రామానికి బస్సు,పాఠశాల పునరుద్ధరణ -మంత్రి అడ్లూరి

గొల్లపల్లి జూన్ 23 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం ఇబ్రహీం నగర్ రైతు వేదిక లో విత్తన మేళా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గత యాసంగి సీజన్ లో పెద్ద ఎత్తున వరి ధాన్యం, మొక్కజొన్న దిగుబడి వచ్చిందని అన్నారు. అధికారుల సమన్వయంతో పనిచేసి రికార్డు స్థాయిలో ధాన్యం, మక్కలు కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. కొనుగోలు చేసిన నాలుగు ఐదు రోజుల లోపు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం సహకరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. వానాకాలం సీజన్ లో ప్రభుత్వం సూచించిన ఏడు రకాల విత్తనాలు మాత్రమే రైతులు సాగు చేయాలని మంత్రి అడ్లూరి కోరారు. శ్రీరాములు పల్లి గ్రామంలో రూ. 70 లక్షలతో ప్రమాదకరం



గా ఉన్న విద్యుత్ వైర్లు తొలగించినట్లు ఐకేపీ సెంటర్ తో పాటు మైదానం ప్రతిపాదనలు వచ్చాయని గ్రామంలో మిగిలిన సీసీ రోడ్లు సంఘ భవనాలు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ గతంలో పెద్ద ఎత్తున రైతులు యూరియా నిలువ చేసే వారిని కొత్తగా తీసుకువచ్చిన య్యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధిక మొత్తంలో యూరియా వాడటం వల్ల భూసారం తగ్గుతుందని అన్నారు. దొడ్డు రకాల ధాన్యానికి డిమాండ్ లేదని రైతులు సన్న వడ్లు సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ఈనెల 23వ తేది నుంచి 31వ తేది వరకు రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ఏడు రకాల విత్తనాలు మాత్రమే సాగు చేయాలని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం అబ్బాపూర్ గ్రామంలో పర్యటించి గ్రామానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో 15ఏళ్ల తరువాత ఆర్టీసీ బస్సు పునరుద్ధరణకు నోచుకుంది. జగిత్యాల నుండి వెల్గటూర్ మండల కేంద్రానికి వయా గొల్లపల్లి, చిల్వకోడూర్, అబ్బాపూర్ మీదుగా వెల్గటూర్ వరకు బస్సు సర్వీసు నడుస్తుండగా 2015లో బస్సు సర్వీసు రద్దు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తిరిగి బస్సు ప్రారంభించాలని స్థానికులు మంత్రి లక్ష్మణ్ కుమార్ ను కోరగా మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని మంగళవారం అబ్బాపూర్ గ్రామంలో కొత్త బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ బస్సు సౌకర్యం కోసం గ్రామస్థులు పలు సందర్భాల్లో తమకు విజ్ఞప్తి చేశారని తెలిపారు. గ్రామస్తుల కోరిక మేరకు బస్సు సౌకర్యం తిరిగి అందుబాటులోకి తెచ్చామని మంత్రి తెలిపారు. గ్రామంలో మూతబడిన పాఠశాల తిరిగి పునరుద్ధరించగా మంత్రి ప్రారంభించారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల సంఖ్య పెంచేలా గ్రామస్థులు కృషి చేయాలని మంత్రి కోరారు.

# రైతుల సంక్షేమం సర్కార్ ధ్యేయం

## - రైతు వేదికలలో విత్తన మేళాలో పాల్గొన్న కూన గోవర్ధన్



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 23 (ప్రజా కలం) మండలం చౌలమద్ది గ్రామంలో నిర్వహించిన రైతు వేదికలలో విత్తన మేళా కార్యక్రమంను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యవసాయ శాఖ తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ,రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి లతో పాల్గొన్నా ఈ కార్యక్రమంలో మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎడి భాస్కర్,ఎ ఈ ఓ దీపిక, సర్పంచులు,ఉప సర్పంచ్ లు, వ్యవసాయ అధికారులు, నాయకులు రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి అందే మారుతి,మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఖుతుబ్బుదిన్ పాషా, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : కోరుట్ల ఎస్సై చిరంజీవి




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 23 (ప్రజాకలం) మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుట్ల ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, మెట్‌పల్లి డీఎస్పీ ఏ. రాములు పర్యవేక్షణలో, కోరుట్ల సీఐ కే. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన సదస్సును కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎస్సై ఎం. చిరంజీవి మాట్లాడుతూ ఇటీవల యువత కొత్త వ్యక్తుల పరిచయాలు, ఆసక్తి, మొదటి అనుభవం ఎలా ఉంటుందో తెలుసుకోవాలనే కుతూహలంతో మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తి విచక్షణా జ్ఞానం కోల్పోవడంతో పాటు మెదడు, గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, రక్తం, నాడీ వ్యవస్థ వంటి కీలక అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. మత్తు పదార్థాలకు బానిసైన వ్యక్తి తన ఆరోగ్యాన్ని, దృఢమైన శరీరాన్ని కోల్పోయి జీవితంలో ఏదీ సాధించలేని పరిస్థితికి చేరుకుంటాడని తెలిపారు. ఇలాంటి చెడు అలవాట్లు వ్యక్తి ఉన్నత లక్ష్యాలను చేరుకోవడంలో అడ్డంకిగా మారుతాయని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యక్రమాలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కష్టపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రెహమాన్, అధ్యాపకులు, సాహితి తదితరులు పాల్గొనగా, సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు.

## వాసవి అమ్మవారి విగ్రహానికి ఘనంగా సహస్ర కలశాభిషేకాలు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 23 (ప్రజాకలం) కోరుట్ల పట్టణంలోని జవహర్ రోడ్‌లో ఉన్న వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ పునఃప్రతిష్ఠ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జూన్ 22 నుంచి 24 వరకు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు పడిగేల శ్రీనివాన్ తెలిపారు. వేడుకల్లో భాగంగా మంగళవారం రెండో రోజు ఆలయ అర్చకులు పాలేపు రాము శర్మ వైదిక నిర్వహణలో మహిళలు సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం 1008 కలశాలతో అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పవిత్ర జలంతో సహస్ర కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వయంగా అభిషేకంలో పాల్గొనేలా సంఘ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు పడిగేల పవన్, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు పడిగేల శ్రీనివాస్, కార్యదర్శి ఎలిమి బుచ్చన్న, కోశాధికారి చౌదరి సూర్యకాంత్, మహిళా అధ్యక్షురాలు బూస మాధురి, మాజీ అధ్యక్షులు నీలి కాశీనాథ్, కోటగిరి ప్రసాద్, అల్లాడి ప్రవీణ్, మోటూరి రాజేంద్రప్రసాద్, మాజీ మండలాధ్యక్షులు పి. జలంధర్, పీఆర్వో బట్టు హరికృష్ణ, వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు కొత్త గణేష్‌తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోగా, భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# బిల్డర్ హత్య కేసులో నిందితుని అరెస్ట్

## - సంచలనం సృష్టించిన హత్య కేసును ఛేదించిన మెట్ పల్లి పోలీసులు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 23 (ప్రజా కలం) పట్టణంలో సంచలనం సృష్టించిన దాసరి రాజేంద్రప్రసాద్ (55) హత్య కేసును మెట్ పల్లి పోలీసులు వేగంగా ఛేదించారు. తొలుత అనుమానాస్పద మృతిగా నమోదైన ఈ కేసు దర్యాప్తులో హత్యగా తేలడంతో నిందితుడిని అరెస్ట్ చేసి, దొంగిలించిన బంగారు చైన్‌తో పాటు హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, డీఎస్పీ ఏ.రాములు పర్యవేక్షణలో, సీఐ బి.సురేష్ బాబు నేతృత్వంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. మెట్ పల్లి ఆదర్శనగర్‌కు చెందిన బిల్డర్ దాసరి రాజేంద్రప్రసాద్ హనుమాన్ నగర్‌లో నిర్మిస్తున్న ఇంటి వద్ద గత 20వ తేదీ రాత్రి తలకు తీవ్ర గాయాలతో మృతదేహంగా కనిపించారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు పోలీసులు మొదట అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. అయితే సంఘటన స్థల పరిశీలన, గాయాల స్వభావం, మృతుడి మెడలో ఉన్న బంగారు చైన్ కనిపించకపోవడం, సాక్షుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాల విశ్లేషణతో ఇది హత్యగా నిర్ధారణ అయింది. దీంతో కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు కొనసాగించారు. దర్యాప్తులో భాగంగా మృతుడి వద్ద టైల్స్, పెయింటింగ్ పనులు చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన గౌతమ్ కుమార్‌పై అనుమానం వ్యక్తమైంది. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. కూలీ డబ్బులు సరిపోవడం లేదనే కారణంతో సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో రాజేంద్రప్రసాద్ వద్ద ఉన్న బంగారు చైన్, ఉంగరాన్ని దొంగిలించాలని పథకం రచించినట్లు తెలిపాడు. అదే సమయంలో పనితీరుపై



రాజేంద్రప్రసాద్ పలుమార్లు మందలించడంతో అతనిపై కక్ష పెంచుకున్న గౌతమ్ కుమార్, ముందుగానే గొడ్డలి కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్నాడు. సంఘటన రోజున నిర్మాణ స్థలం వద్ద జరిగిన వాగ్వాదం అనంతరం గొడ్డలితో తలపై బలంగా దాడి చేసి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. అనంతరం మృతుడి మెడలో ఉన్న బంగారు చైన్ తీసుకుని, తనపై అనుమానం రాకుండా మృతుడి ఇంటికి వెళ్లి "ఫోన్ ఎత్తడం లేదు" అంటూ కుటుంబ సభ్యులను తప్పుదోవ పట్టించినట్లు వెల్లడించాడు. తదుపరి పోలీసుల విచారణలో నిందితుడి వద్ద నుంచి 7.25 గ్రాముల బంగారు చైన్ (గణపతి లాకెట్‌తో సహా), హత్యకు ఉపయోగించిన ఇనుప గొడ్డలి, రక్తపు మరకలున్న దుస్తులు, ఐటెల్ మొబైల్ ఫోన్, హీరో హోండా స్ప్లెండర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు ఛేదనలో విశేష కృషి చేసిన సీఐ బి.సురేష్ బాబు, ఎస్ఐ పి.కిరణ్ కుమార్, ఇబ్రహీంపట్నం ఎస్ఐ జి.నవీన్ కుమార్, మల్లాపూర్ ఎస్ఐ ఏ.అనిల్ కుమార్‌తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## అటవీ-రెవెన్యూ భూ వివాదాల
# పరిష్కారంలో జాప్యం వద్దు

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష - జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం

పెద్దపల్లి,జూన్ 23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో అటవీ,రెవెన్యూ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో డీసీపీ రామ్ రెడ్డి,అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక రవాణా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే జరగాలని సూచించారు. ఇసుక తవ్వకాల అనుమతులకు సంబంధించి రెవెన్యూ,అటవీ శాఖల అధికారులు సంయుక్త సర్వే నిర్వహించాలని ఆదేశించారు. రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి సంయుక్త తనిఖీలు చేపట్టి పూర్తి స్థాయి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల కోసం అవసరమైన అటవీ భూములకు సంబంధించిన ప్రతిపాదనలను ఈ నెల 30 లోగా సమర్పించాలని సూచించారు. గెజిట్‌లో నమోదైన కొన్ని పోడు భూముల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో బి.గంగయ్య, ఇన్‌చార్జి డీఎఫ్‌వో నవీన్ రెడ్డి,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రభుత్వ భూముల సర్వే వేగవంతం చేయాలి**

ఇదివరకు ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇచ్చిన ప్రభుత్వ స్థలాల పంపిణీకి ప్రభుత్వ భూముల సర్వే వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. కాల్వ శ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సందర్శించి ఎంపీడీవో,తహసీల్దార్ తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ వెన్నంపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూముల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన పేదలకు ఇదివరకు ఇచ్చిన ప్రభుత్వ స్థలాలకు పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని తెలిపారు. పెద్దంపేట గ్రామంలో గోదాం నిర్మాణం కోసం గుర్తించిన 10 ఎకరాల భూమికి సంబంధించిన ప్రక్రియను త్వరగా పూర్తి చేసి భూమిని ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవోకు సూచించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని,అందుబాటులో ఉన్న నరేగా నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు,నరేగా పనులకు సంబంధించిన బిల్లులు త్వరలోనే విడుదల కానున్న నేపథ్యంలో పనులను వేగవంతం చేసి లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముత్తారం మండలంలోని ఓడేడు శివారులోని వెంకటేశ్వర్లపల్లి గ్రామ పరిధిలో సీలింగ్ భూములను పరిశీలించారు. భూముల స్థితిగతులను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కాల్వ శ్రీరాంపూర్ తహసీల్దార్ డా.రాముడు,ముత్తారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి,కాల్వ శ్రీరాంపూర్ ఇంచార్జ్ ఎంపీడీవో దివ్యదర్శన్ రావు,తదితర అధికారులు పాల్గొన్నారు.

### తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో పెట్రోల్ బంక్
# ప్రతిపాదనను విరమించుకోవాలి

## - జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



జగిత్యాల ప్రతినిధి జూన్ 23(ప్రజాకలం)

జగిత్యాల తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో పెట్రోల్ బంక్ ప్రతిపాదనను విరమించుకోవాలి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ కు లేఖ రాశారు. జగిత్యాల పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండటంపై ఆయన స్పందించారు. ఇప్పటికే తహసీల్ చౌరస్తా ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, ఈ నేపథ్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ సముదాయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, జగిత్యాల అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన జనాభా ప్రాతిపదికన మరో పట్టణ తహసీల్దార్ కార్యాలయం కూడా మంజూరయ్యే అవకాశం ఉన్నందున ప్రజల రాకపోకలు మరింత పెరిగే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ సమస్యలు, భద్రతా సమస్యలు తలెత్తే అవకాశముందని పేర్కొన్నారు. మరోవైపు పాత బస్టాండ్ సమీపంలోని పోలీస్ క్వార్టర్స్ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసే ప్రతిపాదన కూడా ఉన్నట్లు తెలిసిందని, అక్కడ రహదారి వెడల్పుగా ఉండటంతో వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండటమే కాకుండా ట్రాఫిక్ ఇబ్బందులు తక్కువగా ఉంటాయన్నారు. అందువల్ల తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు విషయమై ఏవైనా ప్రతిపాదనలు ఉంటే ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వాటిని నిలిపివేయాలని కలెక్టర్ ను కోరారు.

ప్రజా కలం
బుధవారం, జూన్ 24, 2026

# విరాళాల వివాదం

అయోధ్య వేర్వేరు సందర్భాల్లో దేశ విదేశాల దృష్టిని ఆకర్షించింది. అయితే ఈసారి కారణం ఆలయ ఉద్యమం, దాని వైభవం లేదా భక్తుల రద్దీ కాదు.శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ పనితీరు, ఆలయ విరాళాల చుట్టూ తలెత్తుతున్న తీవ్ర అవకతవకల ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ రామ్ జన్మభూమి ట్రస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు.ట్రస్ట్ కళ్లముందే ఆలయ విరాళాలు, కానుకల లెక్కల్లో పెద్ద ఎత్తున తేడాలు జరిగాయని, రామాలయ కానుకల నుంచి కోట్ల రూపాయలు మాయమయ్యాయని ఆయన ఆరోపిస్తున్నారు.ఆయనతో పాటు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలతో పాటు స్థానిక మాజీ కరసేవకుడు సంతోష్ దూబే, బీజేపీ నాయకుడు డాక్టర్ రజనీశ్ సింగ్ తదితరులు ఈ అవకతవకలను ప్రస్తావిస్తూ జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ప్రస్తుతం ఈ ఆరోపణలపై విచారణ సాగిస్తోంది. అయితే, ఈలోగా అయోధ్య స్థానికులు, ఇక్కడికి వచ్చే భక్తులలో తీవ్ర నిరాశ, ఆగ్రహం స్పష్టంగా కనిపిస్తున్నాయి.కోట్లమంది నమ్మకం, త్యాగాల ఫలితంగా నిర్మితమైన ఆలయం చుట్టూ ఇలాంటి ఆర్థిక ఆరోపణలు రావడంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీన్ని అయోధ్యకు మచ్చ తెచ్చే అంశంగా భావిస్తే, మరికొందరు పారదర్శకత కోసం విచారణ అవసరమని అంటున్నారు.ఈ వివాదాలన్నింటికీ కేంద్ర బిందువుగా మారిన శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌లో జనరల్ సెక్రటరీ, విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడైన చంపత్ రాయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.2020 ఫిబ్రవరిలో అయోధ్య కేసులో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత, న్యాయస్థానం ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. 15 మంది సభ్యులతో కూడిన ఈ ట్రస్ట్‌లో అధ్యక్షుడిగా మహంత్ నృత్య గోపాల్ దాస్, కోశాధికారిగా స్వామి గోవింద్ దేవ్ గిరి, సీనియర్ న్యాయవాది కె. పరాశరన్, డాక్టర్ అనిల్ మిశ్రా, కామేశ్వర్ చౌపాల్, మహంత్ దినేంద్ర దాస్ సహా పలువురు మత, సామాజిక ప్రతినిధులు ఉన్నారు.ట్రస్ట్ జనరల్ సెక్రటరీగా ఉన్న చంపత్ రాయ్.. దీని రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించే అత్యంత కీలకమైన అధికారి. ఆలయ నిర్మాణ ప్రాజెక్టు, విరాళాలు-కానుకల నిర్వహణ, అధికారిక సంప్రదింపుల బాధ్యత ఆయనపైనే ఉండటంతో మీడియా ప్రతినిధులు ఆయన సమాధానం కోసం ప్రయత్నిస్తున్నారు.ఇటీవల విడుదల చేసిన ఒక వీడియోలో చంపత్ రాయ్ ఈ ఆరోపణలను ఖండించారు.“ శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్రం తన వివిధ పనులకు సంబంధించి సమయానుసారం ఆడిట్ నిర్వహిస్తూనే ఉంటుంది. హుండీ కౌంటింగ్ రూమ్ ఆడిటింగ్‌ను రామాలయ తీర్థ క్షేత్ర ట్రస్టీలు, కార్యకర్తలు, స్టేట్ బ్యాంక్ ఉద్యోగులు కలిసి చేస్తారు. ఈ ప్రక్రియ చాలా రోజుల పాటు సాగుతుంది. ప్రస్తుతం ఆ పనే జరుగుతోంది. ఇప్పటివరకు ఎలాంటి తప్పులూ మా దృష్టికి రాలేదు” అన్నారు.చంపత్ రాయ్‌ను సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ ఎలాంటి స్పందనా రాలేదు. ఆయన సాధారణంగా అయోధ్యలోని కరసేవక్ పురంలో నివసిస్తుంటారు. కానీ, మేం అక్కడికి వెళ్లినప్పుడు.. గత ఏడెనిమిది రోజులుగా, అంటే సిట్ దర్యాప్తు ప్రారంభమైనప్పటి నుంచి ఆయన ఆలయ ప్రాంగణంలోనే ఉంటున్నారని విశ్వహిందూ పరిషత్ సభ్యుడొకరు మాకు తెలిపారు.అయోధ్యలోని స్థానికులు, వ్యాపారులు, సంత్-మహంత్‌లు లేదా రామాలయంతో సంబంధం ఉన్న సామాజిక, మతపరమైన సంస్థల ప్రతినిధులు.. ఇలా వరితో మాట్లాడినా, వారిలో చాలామంది తాజా వివాదం విని తామేమీ ఆశ్చర్యపోలేదని చెప్పారు.గత కొన్నేళ్లుగా ఆలయం, ట్రస్ట్‌కు సంబంధించి రకరకాల వార్తలు, చర్చలు ఎప్పటికప్పుడు బయటకు వస్తూనే ఉన్నాయని, అందుకే ఈ ప్రశ్నలు తలెత్తడం తమకు కొత్తేమీ కాదని కొందరు అభిప్రాయపడ్డారు.అయితే చంపత్ రాయ్ పాత్రపై అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి. అవకతవకల్లో చంపత్ రాయ్ వ్యక్తిగత ప్రమేయం ఉండే అవకాశం లేదని ఆయన మద్దతుదారులు నమ్ముతున్నారు.మరోవైపు, విమర్శకులు మాత్రం ఆయనకు తెలియకుండా ఇంత పెద్ద స్థాయిలో పొరపాట్లు జరగడం అసాధ్యమని వాదిస్తున్నారు. వ్యక్తిగత నిజాయితీ ఎలా ఉన్నా, సంస్థలో జరిగే వాటికి ఆయనే జవాబుదారీ వహించాలని స్పష్టం చేస్తున్నారు.ట్రస్ట్‌పై ఇలాంటి ఆరోపణలు రావడం ఇదే మొదటిసారి కాదు. జూన్ 2021లో అయోధ్యలో కొనుగోలు చేసిన ఒక భూమికి సంబంధించి ట్రస్ట్‌పై ఆరోపణలు వచ్చాయి.ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు దీనిపై స్పందిస్తూ.. ‘ఒక వ్యక్తి రెండు కోట్ల రూపాయలకు కొన్న భూమిని, ఆ ఒప్పందం జరిగిన కొద్ది నిమిషాలకే ట్రస్ట్ 18.5 కోట్ల రూపాయలు చెల్లించి కొనుగోలు చేసింది’ అని ఆరోపించారు.ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్‌తో పాటు పలు ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ విషయంలో పారదర్శకత ఉండాలని కోరాయి.అయితే, చంపత్ రాయ్, ట్రస్ట్ ఈ ఆరోపణలను తిరస్కరించారు. భూమి కొనుగోళ్లన్నీ పారదర్శకంగా జరిగాయని, చెల్లింపులన్నీ బ్యాంకింగ్ మార్గాల ద్వారానే చేశామని, మార్కెట్ ధర కంటే తక్కువకే ఆ భూమిని ట్రస్ట్ కొనుగోలు చేసిందని స్పష్టం చేశారు.ఈ ఆరోపణలు ‘తప్పుదోవ పట్టించేవిగా, ‘రాజకీయ దుర్బుద్ధితో కూడినవిగా’ ఉన్నాయని చంపత్ రాయ్ కొట్టిపారేశారు.కానీ, రాజకీయ పార్టీలు ఇప్పుడు మరోసారి ఈ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయి. 2021లో కూడా ఈ ఆరోపణలపై విచారణ జరిగిందని, అయితే దాని వల్ల ఏమీ తేలలేదని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు, అయోధ్య మాజీ ఎమ్మెల్యే పవన్ పాండే అంటున్నారు.ఆ విచారణ ఎలాంటిది, ఎవరు చేశారు, దాని వల్ల తేలిందేమిటి అనే విషయాలపై ఇప్పటివరకు ఎలాంటి కచ్చితమైన సమాచారం లభించలేదు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్
- వంటశాల పరిశుభ్రత, ఆహార నిల్వలు మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని ఆదేశం
- ధర్మారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



ధర్మారం, జూన్ 23 : ( ప్రజా కలం ప్రతినిధి )

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గురుకుల బాలికల పాఠశాల లో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్యార్థులకు నాణ్య మైన ఆహారం అందించడం తో పాటు వారి సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. ధర్మారం మండలంలోని నంది మేడారం గ్రామం లో ఉన్న టీజీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐఎస్/జూనియర్ కాలేజీ (బాలికలు) పాఠశాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం రోజున సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారికి అందిస్తున్న ఆహార నాణ్యత వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను అత్యుత్తమంగా నిర్వహించాలని సూచించారు. పాఠశాల ప్రాంగణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి శారీరక ఎదుగుదల, విద్యా ప్రగతి, క్రీడలు, ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లో పాల్గొనే తీరును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించడం తో పాటు ఆహార పదార్థాల ను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిల్వ చేయాలని సూచించారు. వంట ప్రక్రియ ను పరిశుభ్రత ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించి, విద్యార్థులకు రుచికరమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందేలా చూడాలని ఆదేశించారు. అనంతరం ధర్మారం ఎంపీడీవో కార్యాల యాన్ని జిల్లా కలెక్టర్ ఆక స్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యా లయ పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ధర్మారం తహసిల్దార్ శ్రీనివాస్, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ ప్రిన్సిపాల్ పద్మ, తదితర అధికారులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

## - ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూన్ 23 (ప్రజా కలం) వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ సూచించారు.కోరుట్ల మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వసంత తిరుమల అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ హాజరై కౌన్సిల్‌లో పొందుపరిచిన వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం సభ్యులు వాటికి ఆమోదం తెలిపారు.సమావేశంలో పట్టణంలోని అన్ని వార్డుల్లో మురికి కాలువల శుభ్రత, తాగునీటి సరఫరా, ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై విస్తృతంగా చర్చ జరిగింది. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మురికి కాలువలను వెంటనే శుభ్రపరచాలని, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సభ్యులు సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.అలాగే ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ ఈఈ, మేనేజర్, టీపీఓ, జేఏఓ, ఆర్వో, శానిటరీ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రైతు వేదికలో ప్రభుత్వం సూచించిన సన్న వడ్ల విత్తన రైతు మేళా

- ఎండపల్లి మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్ ఆధ్వర్యంలో
- పాల్గొన్న గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్



ఎండపల్లి, జూన్ 23 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట రైతు వేదికలో మంగళవారం రోజున ప్రభుత్వం సూచించిన సన్న వడ్ల విత్తన మేళా నిర్వహించడం జరిగింది. ప్రభుత్వం సూచించిన బీపీటీ 5204, ఆర్‌ఎన్‌ఆర్ 15048 (తెలంగాణ సోన), హెచ్‌ఎంటీ సోన, జైశ్రీరామ్, కేఎన్‌ఎం 1638, కేఎన్‌ఎం 7715, రకాల వరి విత్తనాలు, కందులు, పెసర, మొక్క జొన్న వంటి పలు పంటల విత్తనాలను ప్రదర్శించడం జరిగింది. ప్రభుత్వం సూచించిన వరి రకాలను మాత్రమే సాగు చేయాలని రైతులకు తెలియజేయడం జరిగింది. యూరియా కి ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడాలని సూచించడం జరిగింది. అలాగే రైతులకు యూరియా బుకింగ్ పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయాధికారి కమల్ల మహేష్,ఏ ఈ ఒ సుత్రపు లావణ్య, గుల్లకోట గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేశం గౌడ్, చర్లపల్లి సర్పంచ్ పడిదం లావణ్య-మొగిలి, విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు. అలాగే కొత్తపేట, గొడిశెలపేట రైతు వేదికలో నిర్వహించిన రైతు మేళాలో ఏఈఒ కళ్యాడపు మౌనిక, బలిజపల్లి సందీప్, ఆయా గ్రామాల సర్పంచులు, డీలర్లు, రైతులు పాల్గొన్నట్లు ఎండపల్లి మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్ తెలిపారు.

# ఈ-కేవైసీ లేకుంటే ఆగిపోనున్న గ్యాస్ సబ్సిడీ

## జూన్ 30 లోపు ఈ-కేవైసీ పూర్తి చేయండి - అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి



పెద్దపల్లి,జూన్ 23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులందరూ తప్పనిసరిగా జూన్ 30 లోపు తమ ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని పెద్దపల్లి అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి ఆదేశించారు.మంగళవారం జిల్లాలోని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు మరియు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇంకా పెండింగ్‌లో ఉన్న వినియోగదారులను గుర్తించి ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామ సభలు, ఫోన్ కాల్స్,వాట్సాప్ సందేశాలు మరియు ప్రజా ప్రకటనల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ముఖ్యంగా దీపం,ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, డీబీటీఎల్,మహాలక్ష్మి పథకం వంటి సబ్సిడీ లబ్ధిదారులు ఆధార్ సీడింగ్ మరియు బయోమెట్రిక్ ధృవీకరణను నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు.

ఒకవేళ గ్యాస్ కనెక్షన్ హోల్డర్ మరణించి ఉంటే,వారి వారసుల పేరు మీదకు కనెక్షన్‌ను బదిలీ చేయించుకున్న వెంటనే ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని,గడువులోపు పూర్తి చేయని పక్షంలో సబ్సిడీ ప్రయోజనాలు నిలిచిపోయే అవకాశం ఉన్నందున వినియోగదారులు వెంటనే తమ సంబంధిత గ్యాస్ ఏజెన్సీలను సంప్రదించి సహకరించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కే.శ్రీనాథ్,సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్లు,ఆయిల్ కంపెనీల ప్రతినిధులు,గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

# మండలంలో విత్తన మేళా విజయవంతం

## రైతులకు అవగాహన కార్యక్రమం



ఇబ్రహీంపట్నం జూన్ 23( ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని రైతు వేదికలో నేడు విత్తన మేళా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న 7 వరి వంగడాల గురించి రైతులకు వివరించి, ఆయా వంగడాల ప్రత్యేకతలు, దిగుబడి సామర్థ్యం మరియు సాగు విధానాలపై అవగాహన కల్పించారు.అలాగే పంటలలో సమతుల్య పోషక నిర్వహణ కోసం నానో యూరియా మరియు నానో డీఏపీ వినియోగం, వాటి ప్రయోజనాలు, ఖర్చు తగ్గింపు మరియు పర్యావరణ పరిరక్షణలో వాటి పాత్ర గురించి రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఏలాల వెంకట్ రెడ్డి, సర్పంచ్‌లు బండి రాజేష్, పోనకంటి వెంకట్, వ్యవసాయ విస్తరణ అధికారులు వినోద్, సాగర్, రావళిక, సాయికృప, విత్తన డీలర్లు, విత్తనకంపెనీప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.మండలంలోని రైతులు ప్రభుత్వం సూచిస్తున్న నాణ్యమైన విత్తనాలను వినియోగించి, ఆధునిక సాంకేతికతలను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ సూచించారు.

# అంతర్జాతీయ మత్తు పదార్థాలను వాడకూడదన్న ఏసీపీ జి కృష్ణ

ధర్మారం, జూన్ 23 : ( ప్రజా కలం ప్రతినిధి ) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గురుకుల బాలుర పాఠశాల లో రాబోయే అంతర్జాతీయ మత్తు పదార్థాలను వాడ కూడదని వాటి వల్ల కలిగే దుష్ప్రయోజనాల గురించి, డ్రగ్స్



రహిత తెలంగాణ గురించి పెద్దపల్లి ఏసిపి జి కృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమం లో పెద్దపల్లి సిఐ కే ప్రవీణ్ కుమార్, ధర్మారం ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. డ్రగ్స్ గురించి సమాచారం ఇవ్వాలి అను కుంటే డయల్ 1908 కి గాని లేదా ఈగల్ ఫోర్స్ వాట్స్ ఆప్ నెంబర్ 8712671111 దానికి గాని సమాచారం ఇవ్వవచ్చని ధర్మారం ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనే లక్ష్యం

## - బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్ గౌడ్



జూలపల్లి,జూన్ 23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

భారతీయ జన సంఘం వ్యవస్థాపకులు,దేశభక్త శిఖామణి డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ త్యాగనిరతిని ప్రతి కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.మంగళవారం జూలపల్లి మండల కేంద్రంలో ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ భరతమాత ముద్దుబిడ్డగా,దేశ సమగ్రత కోసం తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన మహనీయుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు.ఒకే దేశం-ఒకే రాజ్యాంగం-ఒకే చట్టం అనే నినాదంతో దేశాన్ని ఏకతాటిపైకి తీసుకురావడానికి ఆయన జీవితాంతం చేసిన కృషి అమోఘమని పేర్కొన్నారు.ఆయన ఆశయాలను కొనసాగిస్తూ,దేశ హితం కోసం ప్రతి కార్యకర్త బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో కంకణాల జ్యోతిభస్,తీగల అశోక్,సంకెండ్ల నర్సయ్య,మల్లెత్తుల అంజి,పెద్దోళ్ల అయిలైయ్య,మెరుగు కనుకయ్య,దాడి రవీందర్,కొల్లూరి స్వామి,నాశగుల అన్వేష్, తిరుపతి రెడ్డి,కంచి శ్రీను,మీస అభిషేక్ తదితర ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూలిన గోడ.. పూడిపోయిన బావి

పెద్దపల్లి,జూన్ 23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పెద్దపల్లి మండలం సబితం గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ పరమేశ్వర ఆయిల్ మిల్లు ప్రహరీ గోడ కూలిన ప్రమాదం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.గోడ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం మరియు యజమాని నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ ఘటనలో గోడ శిథిలాలు పక్కనే ఉన్న రెండు విద్యుత్ స్తంభాలపై పడటంతో అవి విరిగిపోయి ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడగా,ప్రమాదవశాత్తు శిథిలాలన్నీ పక్కనే ఉన్న ఒక వ్యవసాయ బావిలో పడి బావి పూర్తిగా పూడిపోయింది. దీనివల్ల ఆ బావిపైనే ఆధారపడి సాగు చేసుకుంటున్న రైతులు నీటి పారుదల లేక ఇబ్బందులు పడుతుండగా,ప్రమాదం జరిగి గంటలు గడుస్తున్నా యజమాని ఇప్పటివరకు ఘటనా స్థలానికి రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.ఈ నేపథ్యంలో బాధితులు వెంటనే సంబంధిత అధికారులు స్పందించి,బావిలోని శిథిలాలను తొలగించి,విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించడంతో పాటు,నష్టపోయిన తమకు తగిన పరిహారం అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.



## విద్యార్థులకు మాదక ద్రవ్యాల పై
# అవగాహన కార్యక్రమం..



మల్లాపూర్, జూన్ 23 ( ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ గ్రామంలోని బీసీ హాస్టల్ లో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాన్ని మల్లాపూర్ పోలీసులు లు నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్య, విద్యా మరియు భవిష్యత్ జీవితంపై కలిగే ప్రతికూల ప్రభావాలను వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాల విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## మోడల్ స్కూల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ చారి..




గొల్లపల్లి జూన్ 23 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాల,మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ చారి ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులు , పాఠశాల మొత్తం పరిశీలించి పాఠశాల నిర్వహణ పట్ల ప్రిన్సిపాల్ సుంకరి రవిని అభినందించారు.వారి వెంట డీఈఓ కే .రాము ప్రిన్సిపాల్ సుంకరి రవి పాఠశాల అధ్యాపకులు ఉన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



మల్లాపూర్ జూన్ 23 ( ప్రజా కలం ప్రతినిధి)మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బిట్ల సరోజన, తాము చదువుకున్న పాఠశాల పట్ల ఉన్న కృతజ్ఞతాభావంతో విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్స్‌ను అందజేశారు. వేంపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 115 మంది విద్యార్థులకు సుమారు రూ.23 వేల విలువైన నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేందర్, ఉపాధ్యాయులు, ఏఎంసీ చైర్మన్ మానస, మాజీ సర్పంచ్ జలపతి రెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు గంగాధర్, శేఖర్, రాజు యాదవ్, శ్రీనివాస్, శ్రీనివాస్ నాయక్, జమీందర్ తదితరులు పాల్గొన్నారు.

## బాసర మహంకాళి ఆలయంలో చోరీ

### - సంఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

జూన్ 23 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి):
నిర్మల్ జిల్లా బాసర లో వెలసిన జ్ఞానప్రదాయాన్ని క్షేత్రంలోని మహంకాళి ఆలయంలో రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి ఆలయం మహంకాళి ఆలయంలో అమ్మవారి వెండి కిరీటం, హుండీని గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ మహంకాళి గేటు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. నగదు కాజేసి అనంతరం ఉండిని వ్యాస గుడి దగ్గర పడేసి పరారయ్యారు. అర్చకులు మంగళవారం తెల్లవారుజామున పూజ కోసం వెళ్లి చూడగా చోరీ ఘటన వెలుగులోనికి వచ్చింది. ఈ సందర్భంగా ఘటన జరిగిన ప్రాంతాన్ని హుటాహుటిన నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల పరిశీలించి చోరీ జరిగిన పరిస్థితులను సేకరించిన ప్రాథమిక ఆధారాలు సిసి ఫుటేజీ నీ పరిశీలన అనంతరం అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి కోణంలో దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి అరెస్టు చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఆలయ భద్రత ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించన
ఎస్పీ జానకి షర్మిల భక్తుల ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘాను మరింత పెంచాలని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించాలని ఆమె కోరారు. కేసులు చేదించేందుకు ప్రత్యేక బృందాలను పర్యవేక్షిస్తామని త్వరలోనే నిందితులను పట్టుకొని చట్టమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల బైంసా ఏ ఎస్ పి సాయికిరణ్, ఆలయ ఈవో అంజనాదేవి, ముధోల్ సిఐ రవీందర్ నాయక్, సమ్మయ్యలు, ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది దేవస్థాన అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన ముఖర్జీ

### పట్టణ బీజేపీ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్ –ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

పెద్దపల్లి,జూన్23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)
ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు,రెండు జెండాలు,ఇద్దరు ప్రధానులు ఉండకూడదు అని నినదించి,దేశ సమగ్రత కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ నాయకులు కొనియాడారు.ఆయన వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పెద్దపల్లిలో బలిదాన్ దివస్ ను ఘనంగా నిర్వహించారు.?ఈ సందర్భంగా పట్టణ బీజేపీ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్ మాట్లాడుతూ ఆధునిక భారతదేశపు గొప్ప జాతీయవాదిగా,రాజనీతిజ్ఞుడిగా ముఖర్జీ చూపిన చొరవ వెలకట్టలేనిదని కొనియాడారు.ఆర్టికల్ 370 రద్దుకోసం ఉద్యమిస్తున్న సమయంలో జైలు పాలైన ఆయన,అక్కడే అనుమానాస్పద స్థితిలో మరణించడం దేశ చరిత్రలో ఒక విషాదకర ఘటన అని గుర్తుచేశారు.ఆయన ఆశయ సాధనలో భాగంగానే నేడు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసి,కాశ్మీర్ ప్రజలకు నిజమైన స్వేచ్ఛను,అఖండ



భారతావనిని సాకారం చేసిందని ఆయన పేర్కొన్నారు.ముఖర్జీ ఆశయాల కోసం తమ కార్యకర్తలు కడవరకు కట్టుబడి ఉంటారని రాకేష్ స్పష్టం చేశారు.అనంతరం ముఖర్జీకి నివాళిగా బీజేపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు,సర్పంచ్ వేల్పుల రమేష్‌తో పాటు పోల్సని సంపత్ రావు,కావేటి రాజగోపాల్,ఎర్రోళ్ల శ్రీకాంత్,గుడ్ల సతీష్, గాదాసి సతీష్,బొడ్డుపల్లి అంజి,కూషన పల్లి మధుకర్,శ్రీనివాస్,శివ,సాయి,శ్రీకాంత్,రాజు తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్కారు పాఠశాలల రక్షణే లక్ష్యం

### ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్ - సుల్తానాబాద్‌లో విద్యా సంస్థల బంద్




సుల్తానాబాద్,జూన్23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)
రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ,ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సుల్తానాబాద్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్ స్థానికంగా విజయవంతమైంది.ఈ సందర్భంగా ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖను చూస్తున్నప్పటికీ, ప్రభుత్వ పాఠశాలలు మౌలిక వసతులు లేక నిర్వీర్యమవుతున్నాయని,విద్యార్థుల సంఖ్యను సాకుగా చూపి 23 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తామనే నిర్ణయం దళిత,ఆదివాసీ,గిరిజన మరియు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని,ప్రైవేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడి ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని,విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలని,ఖాళీగా ఉన్న ఎంఈఓ,డిఈఓ పోస్టులతో పాటు టీచింగ్,నాన్– టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి,పెండింగ్‌లో ఉన్న యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలను వెంటనే పంపిణీ చేయాలని,గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించి నాణ్యమైన భోజనం అందించాలని,అలాగే ఎన్ఈపి–2020 అమలుతో పాటు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను ప్రారంభించాలని మరియు పాఠశాలల వద్దే పుస్తకాలు,యూనిఫామ్స్ విక్రయాలను నిషేధించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది.ఈ బంద్‌కు సహకరించిన పాఠశాల యాజమాన్యాలకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేయగా,ఈ కార్యక్రమంలో హాస్టల్స్ కన్వీనర్ రసూరి ప్రవీణ్,నాయకులు రాజేందర్,దేవాన్ష్,రాజు,వినయ్,సాయి తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు

### ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ - ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయంపై ఏబీవీపీ నిరసన



పెద్దపల్లి,జూన్ 23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 23వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ,అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది.ఈ బంద్ పిలుపుతో జిల్లాలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ విద్యాసంస్థలు యాజమాన్యాలు సెలవు ప్రకటించాయి.ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ,ఇది విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర అని ఆరోపించారు.మూసివేత ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని,ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఆయన డిమాండ్ చేశారు.నిలిచిపోయిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ ను అన్ని పాఠశాలల్లో తక్షణమే పునరుద్ధరించాలని కోరారు.మరోవైపు,ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని,పాఠశాలల ప్రాంగణాల్లోనే పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి పేద,మధ్యతరగతి విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ అజయ్,నగర ఉపాధ్యక్షుడు విగ్నేష్,జోనల్ ఇంచార్జ్ గణేష్,జశ్వంత్,అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా
# విద్యా బోధన ఉండాలి

### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ ,జూన్ 23(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన సాగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు.
తరగతిగదిలోని విద్యార్థులతో కలెక్టర్ పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగారు. వారితో లెక్కలు చేయించారు. విద్యార్థులు పాఠాలను సులువుగా అర్థం చేసుకునే మెలుకువలు నేర్చుకోవాలన్నారు. సామాజిక అంశాల్లో భాగస్వామ్యం అవుతూ పలు విషయాల్లో అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు నేర్పిస్తున్న చదువు, అందిస్తున్న భోజనం సక్రమంగా ఉన్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, పిల్లలకు చదువుతో పాటు, నైపుణ్యాభివృద్ధి తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు వచ్చే సందేహాలు నివృత్తి చేస్తూ ఉండాలని తెలిపారు. ప్రతి రోజు



అన్ని పూటల కామన్ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని చెప్పారు. విద్యార్థులకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం ఖానాపూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని చెప్పారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఏవైనా భూ సమస్యలు ఉన్నాయేమో అని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలలో డిఈఓ భోజన్న, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలి: ఎమ్మెల్యే రామారావు పటేల్

నిర్మల్ ,జూన్ 23(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ పిలుపునిచ్చారు. మంగళవారం బాసర మండల కేంద్రంలో, ఎస్ఐఆర్ (స్పెషల్




ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కలిగేలా 2 కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ తో కలిసి పాల్గొని, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ బాసర మండలంలోని పలు వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని, అధికారులంతా దీనిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా సమగ్ర ఓటర్ జాబితా తయారవుతుందని వివరించారు. భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ప్రజలంతా పూర్తి చేసుకోవాలని కోరారు. నిజమైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ ర్యాలీలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, తహసిల్దార్ పవన చంద్ర, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ.

ఖమ్మం, జూన్ 23(ప్రజా కలం న్యూస్ ) ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న "తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం" పోస్టర్‌ను స్థానిక N7 స్టూడియోస్ లో తెలంగాణ ఉద్యమ నాయకులు ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పిడమర్తి రవి, డాక్టర్ కె.వి. కృష్ణారావు, నందిగామ రాజ్ కుమార్ జానీ, బొబ్బిలి భరత్ చంద్ర, వేల్పుల మురళీ, విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు తమ జీవితాలను త్యాగం చేశారని, వారి పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. అయితే రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు నేటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25,000 గౌరవ పెన్షన్, ప్రత్యేక ఆరోగ్య బీమా సౌకర్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఉద్యమకారుల ప్రత్యేక కోటా, అలాగే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన, ఉద్యమకారుల గౌరవ పరిరక్షణ, వారి హక్కుల సాధనే లక్ష్యంగా ఈ సమ్మేళనం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, విద్యార్థి నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# బాసర అమ్మవారి ప్రతిష్టను కాపాడండి

### ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్
### చోరీ ఘటనపై రాజకీయ నాయకులతో అధికారుల పర్యవేక్షణ



నిర్మల్ ,జూన్ 23(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)
బాసర భారతదేశంలో పవిత్ర పుణ్యక్షేత్రం చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారు ఉండగా నిత్యం వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి తమ తమ చిన్నారులకు అక్షర శ్రీకారాలు దిద్దుతారు ఇక్కడ స్వయంగా మాజీ దివంగత భారత ప్రధాని అనుస్థానం చేపట్టగా పవిత్ర పుణ్యక్షేత్రం గల బాసర ఆలయంలో తరచు దొంగతనాలు జరగడం ఇది అధికారులకు ఎంతవరకు సబాబు అని మంగళవారం స్థానిక ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. గోదావరి నది నుండి బాసర ఆలయం వరకు 2ఎ రన్ లో భాగంగా పాల్గొనగా అనంతరం బాసర ఆలయంలో మహంకాళి అమ్మవారి వెండి కిరీటం హుండీ చోరీకి గురికాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేతో పాటు భైంసా అదనపు కలెక్టర్ సాకేత్ కుమార్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానికి షర్మిల పలువురు ఘటనపై ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు.
మంగళవారమే అమ్మవారి హుండీ లెక్కింపు ఉండగా ఇలాంటి ఘటన జరగడం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సిబ్బంది ఆలయ సిబ్బంది ఏం చేస్తుంది అని ఆలయ అధికారిని అంజన దేవుని అర తీశారు. ఇలాంటి సంఘటనలు పునరుద్ధం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అమ్మవారి ను బంధం కలిగించకుండా ప్రతిష్ట కాపాడుకోవడం మన అందరి బాధ్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు

# తల్లాడలో ఘనంగా ముస్లిం సోదరుల పీర్ల ఊరేగింపు

**త్యాగానికి సూచికగా నిర్వహించే ముస్లిం పవిత్ర పండుగ ఇది**



తల్లాడ జూన్ 23, ప్రజా కలం న్యూస్ మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు మంగళవారం తల్లాడ పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ముస్లిం సోదరుల పవిత్ర పండగ మొహరం పండుగలో భాగంగా ఏడో రోజు కావడంతో డప్పు వాయిద్యాలు, మేళ్ల తాళాల నడుమ పీర్లను చేత పట్టుకొని ముస్లిం సోదరులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణ వ్యాప్తంగా తల్లాడ ప్రధాన రహదారుల్లో ముస్లిం సోదరులు ర్యాలీ నిర్వహించారు. పీర్ల సావిడి వద్ద హోమగుండంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పీర్ల ముజావర్ ఎస్ కే ఈసుఫ్ మాట్లాడుతూ మొహర్రం ముస్లింలకు ప్రత్యేక పర్వదినం అని, త్యాగానికి ప్రతీకగా అసేన్, హుస్సేన్లను ప్రత్యేకంగా ఆరాధిస్తూ పండుగను జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 25వ తేదీన సంతానం లేని వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 29వ తేదీన చివరి రోజు కావడంతో భారీ ఎత్తున ర్యాలీతోపాటు ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ముస్లిం సోదరులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నన్నేసా, అక్బర్, జానీ, ఖాసిం, నాగులు, మెహెరాజ్, చానా, సుభాని, యాసిన్, బాజీ, మహిళలు హసీనా, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నలభై రోజుల గో టు విల్లేజ్ కార్యక్రమం విజయవంతం చేద్దాం



(నందిగామ జూన్ 23 ప్రజా కలం):ప్రతినిధి

నందిగామ మండలం అంతిరెడ్డి గూడా గ్రామంలో మాదిగ మాదిగ ఉపకులాల గో టూ విలేజ్ 40 డేస్ మే 25 నుండి జూలై 05 వరకు కార్యక్రమం పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నందిగామ మండల కో ఇన్చార్జ్ కార్మురి సాయి మాదిగ అధ్యక్షతన గోటు విలేజ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది గ్రామాలలో గో టూ విలేజ్ 40 డేస్ కార్యక్రమాన్ని ఎం.ఆర్.పి.ఎస్ మండల ఇంచార్జి చెన్నగళ్ళ అశోక్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగాఎం.ఆర్.పి.ఎస్ నందిగామ మండల ఇంచార్జి చెన్నగళ్ళ అశోక్ మాదిగ గారు పాల్గొ మాట్లాడుతూ లిపద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలు మేరకు గో టు విలేజ్ కార్యక్రమంనిర్వహిస్తున్నాం ఈ యొక్క కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం చదువు యొక్క ప్రాముఖ్యత గురించి మరియు మధ్యలో చదువు మానేసినటువంటి వారిని తిరిగి బడిలో చేర్పించే విధంగా చైతన్యం చేయడం (ఎం ర్ పి ఎస్) ఉద్యమంలోకి యువతను చదువుకున్న మేధావులను విద్యావంతులను ఉద్యమంలోకి ఆహ్వానించడం, పూర్తి కానీ గ్రామ, మండల కమిటిలు వేయడం జూలై 7 న (ఎం ర్ పి ఎస్)32వ ఆవిర్భావ దినోత్సవాన్ని మరియు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి జన్మదిన సందర్భంగా ప్రతి పల్లెలో జండా దిమ్మెలు ఏర్పాటు చేసి జెండా ఆవిష్కరణ చేయడం అన్నగారి జన్మదిన కార్యక్రమం పండుగ వాతావరణాన్ని కల్పించే విధంగా జరుపుకోవాలని పిలుపునివ్వడం జరిగింది. అనంతరం ఆయా గ్రామాల్లో కార్యక్రమంనందు గ్రామ పెద్దలు సమక్షంలో గోటు విలేజ్ నిర్వహించడం జరిగిందిఈ కార్యక్రమంలో నందిగామ మండల (ఎం ర్ పి ఎస్)ఇంచార్జి చెన్నగళ్లఅశోక్ మాదిగ కో ఇంచార్జి కర్మురి,సాయి మాదిగ గ్రామ పెద్దలు కడిమింటి లక్ష్మయ్య, నాగుల పీటర్, తురుపాటి యాదయ్య, కురువటి మల్లేష్, అంజయ్య, సిద్దప్ప, శంకరాయ, వెంకట్, గ్రామ మహిళలు ఎస్ అంజమ్మ, యాదమ్మ,పడిమింటి అంజమ్మ,ఎస్ లక్ష్మమ్మ, ఎన్ పద్మమ్మ, గ్రామ యవత చదువుకున్న విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# రైతువేదికలలో 'సీడ్ మేళా' షురూ

**- బోనస్ విత్తనాలతో రైతులకు లాభాలు**

**- కొయ్యూరు సర్పంచ్ కొండ రాజమ్మ**

మల్హర్, జూన్ 23 ప్రజాకలం ప్రతినిధి... జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ రావు మండలంలోని తాడిచర్ల మరియు కొయ్యూరు రైతు వేదికలలో ఖరీఫ్ 2026-27 సీజన్‌కు సంబంధించి "సీడ్ మేళా" కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కొయ్యూరు గ్రామ సర్పంచ్ కొండ రాజమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు రైతులకు తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన 7 సన్న రకాల నాణ్యమైన, బోనస్ వరి విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం రైతులకు నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక ఎరువుల వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను వినియోగించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని సరైన యాజమాన్య పద్ధతులు మరియు ఆధునిక ఎరువుల వాడకం ద్వారా సాగు వ్యయాన్ని తగ్గించుకోవచ్చని రైతులు సాంకేతికతతో కూడిన ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఈ ఖరీఫ్ సీజన్‌ను విజయవంతం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు పృథ్వీరాజ్, అనూష, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పెద్దశంకరంపేట్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో

# పాఠశాలల బంద్ విజయవంతం

**- విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం**

**- ఫీజుల నియంత్రణ చట్టాన్ని తేవాలి: ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేష్ పటేల్**

పెద్దశంకరంపేట్, జూన్ 23: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు పెద్దశంకరంపేట్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బంద్ పూర్తిస్థాయిలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు స్వయంగా రంగంలోకి దిగి, మండలంలోని అన్ని పాఠశాలలను మూసివేయించి తమ నిరసనను తెలియజేశారు.

ఈ బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొన్న ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేష్ పటేల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 'ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' పేరుతో గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేయాలని చూస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలోని 27,000 ప్రభుత్వ స్కూళ్లలో దాదాపు 23,000 స్కూళ్లను మూసివేసి, 3 లేదా 4 మండలాలకు కలిపి ఒకే పాఠశాల పెట్టాలనే ముఖ్యమంత్రి ఆలోచన పేద విద్యార్థులకు విద్యను దూరం చేయడమేనని విమర్శించారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీకి కొమ్ముకాసేందుకే ప్రభుత్వం ఇలాంటి కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు.

ఏబీవీపీ ముఖ్య డిమాండ్లు:

పాఠశాలల ఎత్తివేత నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి.

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో విచ్చలవిడి ఫీజుల దోపిడీని అరికట్టేందుకు వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి.

పేద విద్యార్థుల కోసం ప్రైవేట్ స్కూళ్లలో 25% సీట్లు కేటాయించే



విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.

ఖాళీగా ఉన్న వీజూ, ఐజూ పోస్టులతో పాటు టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ సమస్యలు లేకుండా నాణ్యమైన భోజనం, పక్కా భవనాలు ఏర్పాటు చేయాలి.

దేశవ్యాప్తంగా విద్యా ప్రమాణాలు పెంచే చీజూ 2020ని రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలి.

ప్రైవేట్ స్కూల్ మేనేజ్‌మెంట్లు చేస్తున్న పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయాల దోపిడీని నిషేధించాలి.

పాల్గొన్న నాయకులు:

ఈ బంద్ కార్యక్రమంలో దినేష్ పటేల్‌తో పాటు ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు అజయ్, విష్ణు, వేణు, కళ్యాణ్, రమేష్, తదితర కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రత్యక్షంగా పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు."

# ప్రీ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయాలి

**- విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేత**



వాజేడు జూన్ 23 (ప్రజా కలం) ములుగు జిల్లా వాజేడు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలోని నిరుపేద విద్యార్థుల సౌకర్యార్థం ప్రీ-ప్రైమరీ (నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ) పాఠశాలలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజా పోరాట సమితి నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆధ్వర్యంలో మంగళవారం నాడు వాజేడు మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు గారికి ఒక అధికారిక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజా పోరాట సమితి ప్రతినిధులకు విద్యాశాఖ అధికారులు స్పందిస్తూ కొన్ని అనివార్య కారణాలవలన మన మండలానికి ప్రీ ప్రైమరీ పాఠశాల లు మంజూరు కాలేదని, త్వరలోనే వాజేడు మండలానికి కూడా ప్రీ-ప్రైమరీ పాఠశాలలు మంజూరయ్యే అవకాశం ఉందని సానుకూలంగా స్పందించారు.. ఈ సందర్భంగా ప్రజా పోరాట సమితి నాయకులు ముత్తెబోయిన మహేందర్ మాట్లాడుతూ..."ఏజెన్సీ ప్రాంతాలలో అత్యధికంగా నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రజలే నివసిస్తున్నారు. వాజేడు మండలంలో ప్రీ-ప్రైమరీ పాఠశాలలు అందుబాటులో లేకపోవడం వల్ల సుమారు 300 నుండి400 మంది చిన్నారులు సరైన విద్యా సౌకర్యాలు లేక ఇళ్లవద్దనే ఉండిపోతున్నారు. కొద్దిమంది మాత్రమే పక్కనే ఉన్న చెరుకూరు గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు. అంత చిన్న పిల్లలు బస్సులలో ప్రయాణించడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని బ్రతుకులు గడుపుతున్న ఈ పేద ప్రజల దుస్థితిని అర్థం చేసుకొని పాఠశాలల ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. వాజేడు మండలంలోని ధర్మవరం, అయ్యవారిపేట, కోరకల్ గ్రామాలతో పాటు అన్ని గ్రామాలకు ప్రీ-ప్రైమరీ పాఠశాలలను తక్షణమే మంజూరు చేయాలి." అని డిమాండ్ చేశారు. మండలంలోని పేద విద్యార్థులకు న్యాయం జరిగే వరకు మరియు అన్ని గ్రామాల్లో ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేసేంత వరకు తమ పోరాటం ఆపబోమని ప్రజా పోరాట సమితి ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో ప్రజా పోరాట సమితి ప్రతినిధులు,గగ్గూరి నాగేంద్ర బాబు, గౌరారపు చంద్రశేఖర్, ప్రజలు పాల్గొన్నారు

# అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం



( వరంగల్/ పర్వతగిరి) జూన్ 23, ప్రజాకలం ప్రతినిధి.

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం లో భాగంగా, మంగళవారం ఆర్.డి.ఎఫ్ కళాశాల కల్లెడలో అవగాహన కార్యక్రమానికి పర్వతగిరి ఎస్సై బి ప్రవీణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎస్సై బి.ప్రవీణ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, తమకంటూ ఒక గోల్ ను మనసులో పెట్టుకొని విద్యపై దృష్టి సాధించి ముందుకు సాగాలని, చెడు ఆవాసాలకు, మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని, విద్య పై మంచి పట్టు ఉన్న విద్యార్థులే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎస్ఐ విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాలలో గాని, కళాశాలలో గాని, ఉన్నంతవరకే ఉపాధ్యాయులు వారిని చూడటం గాని, గమనించడం కానీ జరుగుతుందని, ఇంటికి వచ్చాక విద్యార్థులు ఏం చేస్తున్నారన్నది చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని, పిల్లలకి చిన్నతనం నుండే తల్లిదండ్రులు వారికి ఫోన్లు అలవాటు చేస్తారని, అలా చేయడంవల్ల పిల్లలు ఫోన్లో గేమ్స్ ఆడుకుంటున్నారా.. లేదా బెట్టింగ్లు పెడుతున్నారా.. తల్లిదండ్రులు గమనించాలని అన్నారు. పిల్లలకు పాఠశాలలో ఉపాధ్యాయులు ఏం చెప్పారని



పిల్లలు ఏం చదువుతున్నారని పిల్లల ద్వారా తల్లిదండ్రులు అడిగి తెలుసుకోవాలని సూచించారు. పిల్లలు చెడు సవాసానికి వెళ్తే తల్లిదండ్రులు గమనించి అప్రమత్తంగా ఉండాలని, పిల్లలని ఎప్పటికప్పుడు గమనించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉన్నదని ఎస్ఐ బి. ప్రవీణ్ విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఇందులో భాగంగా వ్యాస రచన, పెయింటింగ్, ఆటల పోటీలు, వక్తృత్వ పోటీలు, నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, పోలీస్ సిబ్బంది లు పాల్గొన్నారు.

## పలు మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

( వరంగల్/ పర్వతగిరి) జూన్ 23, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండలం తురుకల సోమారం గ్రామానికి చెందిన వడ్లకొండ ఎల్లగౌడ్, యం.డి అహ్మద్, ఇటీవల ఘోర రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మరణించారు. ఈ విషయం తెలుసుకొని మంగళవారం ఇరువురి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి ప్రగాఢసానుభూతి తెలియచేసారు. పర్వతగిరి మండల కేంద్రంలో ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బుద్దె చరణ్ కుటుంబ సభ్యులను నేడు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, చరణ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన అంకటి మల్లేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకుని, వారి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపారు. తదుపరి పర్వతగిరి మండలం దౌలత్‌నగర్ గ్రామానికి చెందిన దొనికేన శ్రీనివాస్ గౌడ్ (చికెన్ సెంటర్ ) ప్రమాదవశాత్తు తాటిచెట్టు నుంచి కిందపడడంతో మృతి చెందిన నేపథ్యంలో, నేడు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీనివాస్ గౌడ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్. ఈ పరామర్శలో సొసైటీ చైర్మన్ యం.మనోజ్ గౌడ్, మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, ఏయంసీ మాజీ వైస్ చైర్మన్ ఏడుదొడ్ల జితేందర్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రంగు కుమార్ గౌడ్, స్థానిక మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్, మండల నాయకులు చీమల బిక్షపతి, చిన్నమాధవరావు, యూత్ అధ్యక్షులు బూర శ్యామ్ గౌడ్, అశోక్ రావు, బొట్ల మధు, జూల్లపెల్లి దేవేందర్ రావు, మాజీ సర్పంచ్ బొట్ల కిష్టయ్య, కొల్లూరి వెంకటేశ్వర్లు, బానోత్ వెంకన్న, గంధం బాలరాజు, జంగిలి యాకయ్య, బాలే వెంకటరాజు, సముద్రాల సాంబయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు మెరుగు వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు చిన్నపెల్లి విజయ, కొప్పు రాజు, ఇస్లావత్ హరీష్, నాయకులు జంగా వీరమల్లు, బొట్ల భాస్కర్, దబ్బేట నరేష్, చింతపట్ల సునీల్ రావు, నారెడ్ల చంద్రయ్య, పిండి వెంకన్న, దొనికేన రాజు, మాడుగుల అఖిల్, సోషల్ మీడియా నాయకులు చిన్నపెల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలను సందర్శించిన సర్పంచ్ బెనిని



వాజేడు జూన్ 23( ప్రజా కలం) మండల పరిధిలోని అయ్యవారి పేట గ్రామంలోని పాఠశాలను సర్పంచ్ మడకం బెనిని సందర్శించారు. పాఠశాలలో ఉన్నటువంటి సమస్యలను ఉపాధ్యాయులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు.

# చిత్తూరు జిల్లాలో తీవ్ర విషాదం

**భార్య ఇద్దరు పిల్లలకు విషం తాగించి, తాను ఆత్మహత్య చేసుకున్న తండ్రి**

చిత్తూరు : భార్య అనారోగ్యంతో తల్లడిల్లిన ఆ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. ఆ తండ్రి భార్య ఇద్దరు పిల్లలకు విషం తాగించి, తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఏటీఎం పిన్ రాసిపెట్టి అంత్యక్రియలకు తమ డబ్బులే వాడాలని వినతి చేసాడు. చిత్తూరు జిల్లా దిగుమసపల్లె పంచాయతీలోని బంగారెడ్డిపల్లి గ్రామంలో భార్య నిర్మల(25), కొడుకు రాజేష్(13),కూతురు శ్రీవిద్య(11)లతో కలిసి దామోదరం (30) అనే వ్యక్తి నివసిస్తున్నాడు. బ్రెయిన్ స్ట్రోక్తో చికిత్స పొందుతున్న భార్య పరిస్థితి విషమించడంతో, భార్యా పిల్లలకు విషం తాగించి అనంతరం తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్లో ఏటీఎం పిన్ నంబర్, ఫోన్ పే నంబర్ రాసి, అంత్యక్రియలకు తమ డబ్బులే వాడాలని విజ్ఞప్తి చేసాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కరెంట్ షాక్తో భార్యా భర్తలు మృతి

నిజామాబాద్ : బట్టలు ఆరేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో దంపతులు మృతి చెందారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం ఉట్పల్లి గ్రామంలో ఉతికిన బట్టలు ఆరేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో, రత్నావత్ సంజీవ్(45), జ్యోతి(41) అనే దంపతులు కరెంట్ షాక్తో అక్కడికక్కడే మృతిచెందారు. ముగ్గురు పిల్లలు స్వల్ప గాయాలతో ప్రమాదం నుండి బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మాజీ సిఐ నాగరాజు కి మద్దతుగా

# కృష్ణలంకలో కొవ్వొత్తులు ర్యాలీ

**ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న యువత, స్థానిక మహిళలు**

విజయవాడ : కృష్ణలంక మాజీ సిఐ నాగరాజు కి మద్దతుగా కృష్ణలంకలో కొవ్వొత్తులు ర్యాలీ నిర్వహించారు. స్థానికులు మాట్లాడుతూ నాగరాజు కృష్ణలంక పిఎస్‌లో చార్జి తీసుకున్నప్పటి నుండి రౌడీయిజం మీద ఉక్కు పాదం మోపారు. ముఖ్యంగా కృష్ణలంక ఏరియాలో గంజాయి బ్యాచ్ ఆగడాలను పూర్తిగా అరికట్టారని అన్నారు. ఆడపిల్లలపై ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే వాడి కి తమదైన శైలిలో ట్రీట్మెంట్ ఇచ్చి నేరలను అరికట్టారు. గత ప్రభుత్వ హయాంలో రాత్రిపూట పది తర్వాత ఆడవాళ్లు బయటికి వెళ్లాలంటేనే భయపడే వారు. ఇప్పుడు నాగరాజును ఇక్కడి నుండి తప్పిస్తే మళ్లీ వారి ఆగడాలు ఎక్కువ అవుతాయి. గతంలో రౌడీ షీటర్లను ఎన్కౌంటర్ చేసినప్పుడు దానిని సమర్థించిన పెద్దలు దీన్ని ఎందుకు తప్పుగా అర్థం చేసుకుంటున్నారని ప్రశ్నించారు.

# వారాసిగూడలో పోలీసులు సైబర్ నేరాల అవగాహనా కార్యక్రమం

వానాసిగూడ : వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలు జరుగుతున్న తీరు మరియు సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన అటువంటి జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా చిలకలుగూడ ఏసీపీ కె.శశాంక్ రెడ్డి, వారాసిగూడ ఇన్స్పెక్టర్ రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు పంపే మెసేజ్లకు కానీ, వీడియో కాల్స్ కు కానీ ఎవరు స్పందించవద్దు, వారికి డబ్బులు పంపవద్దని సూచించారు. తమ తమత రాదు, వ్యక్తిగత సమాచారాన్ని గుర్తు తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని అన్నారు. నిర్ధారించుకున్న తర్వాతనే మీరు అవతలి వ్యక్తులకు డబ్బులు పంపించాలి. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరానికి గురి అయితే వెంటనే గోల్డెన్ అవర్లో 1930 కు కాల్ చేసి సమాచారం అందజేస్తే జీరో ఎఫైర్ నమోదు చేసి సంబంధిత పోలీస్ స్టేషన్ కి పంపుతామని అన్నాఉ. తద్వారా ఎఫ్ఐఆర్ నమోదు అవుతుంది.

## సాయికృష్ణ కేసు..

# మార్కాపురం టు విజయవాడ మధ్యలో ఏం జరిగింది?

ఒంగోలు : విజయవాడ నగరంలో సాయికృష్ణ అదృశ్యం కేసు ఇప్పుడు పెను సంచలనంగా మారింది. అసలు సాయికృష్ణ ఏమయ్యాడు, పోలీసులు కస్టడీలో ఉండగానే ప్రాణాలు కోల్పోయడా? లేదా ఎవరైనా మాయం చేశారా? ఈ ప్రశ్నల చుట్టూ తిరుగుతున్న మిస్టరీని ఛేదించేందుకు ఏసీపీ దైవప్రసాద్ నేతృత్వంలోని స్పెషల్ టీమ్ రంగంలోకి దిగింది. శుక్రవారం ఉదయమే కృష్ణ లంకలోని సాయికృష్ణ నివాసానికి చేరుకున్న అధికారులు, కుటుంబసభ్యుల నుంచి సేకరించిన వివరాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి. ఒకవైపు కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు, మరోవైపు పోలీసుల ఇన్వెస్టిగేషన్ మధ్య ఈ కేసులో అనేక మలుపులు తిరుగుతోంది. సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చినప్పటి నుంచి స్టేషన్‌లో జరిగిన పరిణామాల వరకు ప్రతి అంశాన్ని దర్యాప్తు బృందం భూతద్దంతో వెతుకుతోంది. ముఖ్యంగా పోలీసులపైనే ఆరోపణలు వస్తుండటంతో సాక్ష్యాల సేకరణలో అధికారులు అత్యంత గోప్యత పాటిస్తున్నారు. ఏసీబీ దైవప్రసాద్ బృందం నేరుగా సాయికృష్ణ ఇంటికి వెళ్లింది. అక్కడ సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి మేనమామ నాగేశ్వరరావు, పిన్ని కనకదుర్గలను సుదీర్ఘంగా విచారించి వారి స్టేట్మెంట్‌లు రికార్డ్ చేశారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు విచరణాధికారులను సైతం విస్మయానికి గురి చేశాయి. సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కృష్ణలంక స్టేషన్ లాకప్‌లో ఉంచారని, అక్కడ సీఐ నాగరాజు అతడిని అమానుషంగా చిత్ర వధ చేసి చంపేశారని వారు ఆరోపించారు. కుటుంబ సభ్యుల స్టేట్మెంట్‌ల అనంతరం దర్యాప్తు టీం కృష్ణ లంక స్టేషన్‌కు చేరుకుంది. అక్కడ కేవలం మాటలతో కాకుండా డిజిటల్ ఎవిడెన్స్ ఆధారంగా నిజానిజాలు తేల్చాలని నిర్ణయించింది. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ కెమెరాల దృశ్యాలు అత్యంత కీలకం కావడంతో అప్పటికప్పుడు ఫోరెన్సిక్ అండ్ సైబర్ అనాలసిస్ టీమ్ పిలపించారు. వీటిన్నింటినీ అధికారులు సీజ్ చేసి, విశ్లేషణ కోసం నేరుగా ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఆ రాత్రి స్టేషన్‌లో ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఈ డిజిటల్ ఆధారాలే ఇప్పుడు కీలకంకానున్నాయి. సాయికృష్ణను మార్కాపురం నుంచి విజయవాడకు ఎప్పుడు తీసుకొచ్చారు? ఈ ఆపరేషన్‌లో ఎవరెవరు పాల్గొన్నవారు? అనే కోణంలో విచారణ సాగుతోంది. టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ లతాకుమారితోపాటు మరో ఎనిమిది మంది సిబ్బందిని శుక్రవారం దర్యాప్తు టీం విచారించింది. పెండింగ్‌లో ఉన్న ఔఃచి అమలు చేసేందుకే సాయికృష్ణ కోసం నలుగురు సిబ్బందిని మార్కాపురం పంపినట్టు ఏడీసీపీ వివరించినట్టు సమాచారం. అయితే అతడి తీసుకొచ్చిన తర్వాత ఎవరికి అప్పగించారు.?లాకప్‌లో ఉంచిన సమయం ఎంత? అనే ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు వారి స్టేట్మెంట్‌లు రికార్డు చేశారు. కేసు తీవ్రతను దృష్ట్యా, ఈ అదృశ్యం వ్యవహారంపై విచారణాధికారిగా తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్‌ను నియమించారు. ఆయన శుక్రవారం విజయవాడకు చేరుకుని, తొలుత డీజీపీని కలిసి కేసు పురోగతిని వివరించారు. అనంతరం విజయవాడ సీపీ రాజశేఖరబాబును కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేరుగా కృష్ణలంక స్టేషన్‌కు వెళ్లిన ఎస్పీ, అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని వ్యక్తిగతంగా ప్రశ్నిస్తూ, ఎక్కడైనా గ్యాప్స్ ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రస్తుతానికి దర్యాప్తు బృందం ఎనిమిది మంది కీలక సిబ్బందిని విచారిస్తోంది. ఇందులో టాస్క్‌ఫోర్స్, కృష్ణలంక స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.

చట్టం ఏం చెప్తోంది? శవం లేకపోతే కేసు నిలవదా?

సినీ ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన దృశ్యం' సినిమా కథ అందరికీ గుర్తే. అక్కడ ఒక హత్య జరుగుతుంది, నిందితులు ఎవరో పోలీసులకు స్పష్టంగా తెలుసు. కానీ, బాడీ దొరక్కపోవడంతో హీరో చాకచక్యంగా చట్టం పరిధి నుంచి తప్పించుకుంటాడు. సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు కూడా శవం



దొరకకూడదని, హీరో సేఫ్ కావాలని టెన్షన్‌తో కోరుకుంటారు. సరిగ్గా ఇదే తరహా సస్పెన్స్, ఉత్కంఠ ఇప్పుడు విజయవాడ కృష్ణలంకకు చెందిన రౌడీషీటర్ గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులోనూ కనిపిస్తోంది. సాయికృష్ణ కనిపించకుండా పోయి నెల రోజులు దాటుతున్నా, అతని ఆచూకీ ఏమైందనే దానిపై అటు పోలీసుల దగ్గర, ఇటు కోర్టుల దగ్గర స్పష్టమైన సమాధానం లేదు. చట్టం ముందు ప్రస్తుతం అతను 'మిస్సింగ్' మాత్రమే."పోలీసులు అతడిని కస్టడీలోనే చంపేశారు.. బూడిద కూడా లేకుండా కాల్పించేశారు" అంటూ వస్తున్న వార్తలన్నీ ప్రస్తుతం కేవలం రాజకీయ ఆరోపణలు, గాసిప్స్‌గానే ప్రచారంలో ఉన్నాయి. ఒకవేళ లాకప్‌లో ఏదైనా అనూహ్య సంఘటన జరిగి ప్రాణాలు పోయి ఉంటే.. సాధారణంగా పోలీసులు ఆసుపత్రికి తరలించడమో, గుండెపోటు అని కవర్ చేయడమో చేస్తుంటారు. కానీ, ఇక్కడ అసలు ఆనవాళ్లే లేకుండా మాయం చేశారనే ప్రచారం దృశ్యం సినిమాలోని పోలీస్ స్టేషన్ కింద శవాన్ని దాచిపెట్టిన ట్విస్ట్‌ను గుర్తుకు తెస్తోంది. ఈ వ్యవహారంలో పటమట, కృష్ణలంక పోలీస్ సర్కిళ్లలో ఏం జరిగిందో ఎవరికీ తెలియదు, పోలీసులు నోరు విప్పడం లేదు. దీంతో ఈ ఉదంతం ఎప్పటికీ ఛేదించలేని ఒక మిస్టరీగా మిగిలిపోనుందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఈ కేసులో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. తాము సాయికృష్ణను అసలు అదుపులోకే తీసుకోలేదని పోలీసులు కోర్టుకు గట్టిగా చెప్పలేకపోతున్నారు. సాయికృష్ణతో పాటు మార్కాపురంలో పట్టుబడిన మిగిలిన వారిని పోలీసులు విచారించి అప్పట్లోనే వదిలేశారు. వారితో పాటే సాయికృష్ణను కూడా మేము వదిలేశాం, ఆ తర్వాత అతను ఎక్కడికి వెళ్ళాడో మాకు తెలియదు అని చెప్పుకునే లూప్‌హోల్ పోలీసులకు ఉంది. కానీ, తమకు అసలు సంబంధమే లేదని పూర్తిగా తిరస్కరించకుండా, విచారణకు సమయం కోరడమే ఇక్కడ కథను మలుపు తిప్పుతోంది. సాయికృష్ణ ఆనవాళ్లు దొరక్కపోతే, తాము స్టేషన్ నుంచి పంపించేసిన తర్వాతే అతను అదృశ్యమయ్యాడనే వాదనను పోలీసులు తెరపైకి తెచ్చే అవకాశం లేకపోలేదు. దృశ్యం సినిమాలో లాగా శవం దొరక్కపోతే పోలీసులు చట్టపరంగా సేఫ్ అయినట్లేనా అంటే.. న్యాయశాస్త్రం ప్రకారం అలా అనుకుంటే పొరపాటే. కార్పస్ డెలెక్టి సూత్రం ప్రకారం సాధారణంగా నేరాన్ని నిరూపించడానికి భౌతిక ఆధారాలు అవసరమే అయినప్పటికీ.. సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో స్పష్టం చేసినట్లు పరిస్థితుల ప్రభావం బలంగా ఉండి, నిందితుడు చివరిసారిగా ఎవరి ఆధీనంలో ఉన్నాడో రుజువైతే శవం లేకపోయినా శిక్ష ఖరారు చేయవచ్చు." సాయికృష్ణను పోలీసులు తీసుకెళ్లినట్లు సాక్ష్యాలు ఉన్నాయి కాబట్టి, ఆ తర్వాత అతను ఏమయ్యాడో నిరూపించాల్సిన పూర్తి బాధ్యత సెక్షన్ 106 ప్రకారం పోలీసుల పైనే ఉంటుంది. హైకోర్టు విధించిన గడువు లోగా ఆనవాళ్లు దొరక్కపోతే.. ఈ దృశ్యం' తరహా కథ క్లైమాక్స్ పోలీసులకు చుట్టుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఎమ్మెల్సీ కాలేజీల్లో అన్నీ లోపాలే

గుంటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తనయుడు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కృష్ణ చైతన్య విద్యాసంస్థల పై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ఈ విద్యాసంస్థలకు చెందిన ఆరు జూనియర్ కళాశాలలపై గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ప్రత్యేకంగా వచ్చిన విద్యాశాఖ, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అధికారులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రారంభమైన ఈ తనిఖీలు అర్ధరాత్రి దాటే వరకు సాగాయి. అధికారుల సుదీర్ఘ తనిఖీల్లో సదరు విద్యాసంస్థల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను ఏ ఒక్కటి కూడా సక్రమంగా పాటించడం లేదనే్గ్రాభ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. అగ్నిమాపక శకటం వెళ్లేందుకు కనీస స్థలం లేకపోవడం, ఫైర్ సేఫ్టీ అనుమతులు గడువు ముగిసినా నూతనీకరించకపోవడం, సామర్థ్యానికి మించి ఒకే గదిలో విద్యార్థులను గొర్రెల మందలా ఉంచడం వంటి అనేక లోపాలను అధికారులు గుర్తించారు. అంతేకాకుండా, ల్యాబ్‌లలో కెమికల్స్ భద్రత సరిగా లేకపోవడం, విద్యార్థులకు కనీస తాగునీరు, పరిశుభ్రమైన శానిటేషన్ వసతులు కూడా కల్పించకపోవడాన్ని కూడా గుర్తించారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఉండేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. పొరుగు జిల్లా అయిన గుంటూరుతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించారు. కాలేజీ రికార్డులు, అటెండెన్స్ రిజిస్టర్లు, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్, హాస్టల్ అనుమతులకు సంబంధించిన ప్రతీ పత్రాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అర్ధరాత్రి దాటే వరకు అటెండెన్స్ సాఫ్ట్‌వేర్ డేటాను, అడ్మిషన్ల రికార్డులను క్రాస్ వెరిఫై చేసిన అధికారులు.. అనుమతులు లేని అదనపు సెక్షన్లను నడుపుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించి ఆయా ఫైళ్లను సీజ్ చేశారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కుమారుడు చైర్మన్‌గా ఉన్న విద్యాసంస్థలు కావడంతో, ఐదేళ్ల హయాంలో ఇక్కడి లోపాలపై స్థానిక అధికారులు కన్నెత్తి కూడా చూడలేదనే ఆరోపణలు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా రూల్స్ ఉల్లంఘించే కార్పొరేట్ కాలేజీలపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ తనిఖీలపై గుంటూరు, నెల్లూరు అధికారులు తుది నివేదికను ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్‌కు సమర్పించనున్నారు. నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కిన కృష్ణ చైతన్య విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు భారీగా జరిమానా విధించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉన్నతాధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# కదిరిలో సవాళ్లు.. ప్రతి సవాళ్లు

అనంతపురం : సత్యసాయి జిల్లాలో టీడీపీ వర్సెస్ వైసీపీ రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా కదిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి మధ్య నడుస్తున్న వ్యక్తిగత ఆరోపణలు, సవాళ్లు కదిరి రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. ఇరు పార్టీల నేతలు అవినీతి, కబ్జాలు, కుటుంబ సభ్యులపై ఆరోపణలతో బహిరంగ చర్చలకు సై అంటూ సవాళ్లు విసురుకుంటున్నారు.

కదిరి టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థాయి వేరు.. ఆయన తండ్రి వైఎస్సార్ కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు. అలాంటి నాయకుడి భార్యను అకారణంగా రాజకీయాల్లోకి లాగి అవమానిస్తావా అంటూ ప్రవీణ్ రెడ్డి ఎమ్మెల్యేను నిలదీశారు. నీతి, నిజాయితీల గురించి మాట్లాడే ముందు ఎమ్మెల్యే తన గతం, చరిత్ర గురించి ఆలోచించుకోవాలని, మహిళల గురించి మాట్లాడే ముందు కొంత సంస్కారం నేర్చుకోవాలని హితవు పలికారుఎమ్మెల్యే ప్రసాద్ అవినీతి గురించి మాట్లాడితే కదిరి ప్రజలు నవ్వుకుంటున్నారని ప్రవీణ్ రెడ్డి ఎద్దేవా చేశారు. కదిరి నియోజకవర్గంలో బ్రాందీ షాపులు, పల్లెల్లో బెల్ట్ షాపులు పెట్టించి.. మద్యం బాటిల్‌పై రూ. 20 నుండి రూ. 40 వరకు అధికంగా అమ్మించి కమిషన్లు దండుకుంటోంది ఎమ్మెల్యే కాదా? అని ప్రశ్నించారు. ఆ అక్రమంగా వసూలు చేసిన డబ్బులు మీ ఇంట్లో వాళ్లు ఇస్తున్నారా అని మేము అడిగితే అది తప్పు అవుతుందా? అని ఘాటుగా నిలదీశారు. అంతేకాకుండా, కదిరిలో ఎమ్మెల్యే తన ఇంటి ముందున్న దేవుడి మాన్యం స్థలాన్ని 15 ఏళ్లుగా కబ్జా చేసి సొంత పార్కింగ్‌గా వాడుకోవడం నిజం కాదా అంటూ దేవాదాయ శాఖ భూముల కబ్జాపై సంచలన ఆరోపణలు చేశారు. గడిచిన రెండున్నరేళ్ల కాలంలో కదిరి నియోజకవర్గానికి ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యమని ప్రవీణ్ రెడ్డి విమర్శించారు. ముఖ్యంగా కదిరిలో మైనార్టీ ముస్లింలపై ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పేద ముస్లింలు పెళ్లిళ్లు చేసుకునే ప్రభుత్వ షాదీ మహల్‌కు రెండున్నరేళ్లుగా ఎందుకు తాళాలు వేశారు? వారు చేసిన పాపం ఏంటి? అని ప్రశ్నించారు. ఇది చాలదన్నట్లు, కదిరి కాలేజీ సర్కిల్‌లో కోట్ల రూపాయల విలువైన వక్ఫ్ బోర్డు స్థలంలో ముస్లింల సమాధులను సైతం తొలగించి, ఆ స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా వేసి అమ్ముకోవాలని ఎమ్మెల్యే ప్రయత్నించడం వాస్తవం కాదా అంటూ నిలదీశారు. కదిరిలో తాను అడిగిన సూటి ప్రశ్నలకు ఎమ్మెల్యే ప్రసాద్ నేరుగా సమాధానం చెప్పాలని, తన అనుచరులను ప్రయోగించి పారిపోవద్దని ప్రవీణ్ రెడ్డి సవాల్ విసిరారు. వారిని బలి చేయవద్దు. రేపు ప్రభుత్వం మారితే నీకంటే ముందు వాళ్లే కేసుల్లో ఇరుక్కుంటారు, అప్పుడు వారి పరిస్థితి ఏమిటో ఆలోచించు అని హెచ్చరించారు. మనం ఇద్దరం నేరుగా కూర్చుని కదిరి అభివృద్ధిపై, కబ్జాలపై మాట్లాడుకుందాం. ఏ చర్చకైనా నేను సిద్ధం అంటూ బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. ప్రస్తుతం కదిరిలో వైసీపీ వర్సెస్ టీడీపీ మధ్య జరుగుతున్న ఈ మాటల యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. భూకబ్జాలు, మద్యం మాఫియా, వక్ఫ్ ఆస్తుల ఆక్రమణల వంటి కీలకమైన ఆరోపణలు తెరపైకి రావడంతో స్థానిక రాజకీయాలు వేడెక్కాయి. ప్రవీణ్ రెడ్డి విసిరిన ఈ సవాళ్లపై ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ , టీడీపీ శ్రేణులు ఏ విధంగా స్పందిస్తాయో, ఈ బహిరంగ చర్చ సవాల్ ఎక్కడి వరకు దారితీస్తుందో అని కదిరి ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# అనంతపురం టూ అమరావతి

అనంతపురం : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వేగంగా చేరుకునేలా ఆయా జిల్లాల్లో ప్రభుత్వం పలు ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో హైవేలు, రోడ్డు విస్తరణ పనులు ప్రారంభంకానున్నాయి. అనంతపురం జిల్లా నుంచి అమరావతికి వేగంగా చేరుకునేలా ప్లాన్ చేశారు. ఈ రోడ్లకు సంబంధించిన పనులు పూర్తిచేస్తే ప్రయాణ సమయం తగ్గుతుందంటున్నారు. రాజధాని అమరావతికి అన్ని జిల్లాల నుంచి కనెక్టివిటీ ఉండేలా ప్లాన్ చేసింది. కేంద్రం సహకారంతో కొత్తగా రోడ్లకు సంబంధించి ప్రాజెక్టుల్ని తీసుకొచ్చే పనిలో ఉంది. అనంతపురం జిల్లా నుంచి అమరావతికి వెళ్లడానికి హైవేలు, రోడ్లకు సంబంధించిన ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లేందుకు నేషనల్ హైవే-544జీ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం 624 కి.మీ.ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ విజయవాడ నుంచి బెంగళూరుతో కనెక్ట్ చేస్తోంది. విజయవా నుంచి నేషనల్ హైవే 16 మీదుగా వచ్చి ప్రకాశం జిల్లా ముప్పవరం, అద్దంకి మీదుగా హైవే వెళుతుంది. ఈ హైవే పూర్తి చేస్తే 110 కి.మీ.లు దూరం తగ్గి, ప్రయాణ సమయం తగ్గుతుందంటున్నారు. ఈ హైవే ప్రకాశం, నెల్లూరు, కడప, శ్రీ సత్యసాయి జిల్లా మీదుగా వెళుతుంది. అలాగే అనంతపురం జిల్లా నుంచి అమరావతి వెళ్లేందుకు రోడ్ల అనుసంధానంపై ఫోకస్ పెట్టారు. మలకవేముల క్రాస్ దగ్గర జంక్షన్ ఏర్పాటు చేసి బీకేవీ (బెంగళూరు, కదిరి, విజయవాడ) ప్రాజెక్టు ద్వారా అనంతపురం జిల్లా జిల్లా నుంచి అమరావతికి కేవలం 5 గంటల్లో చేరేలా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభంకానున్నాయి. ముదిగుబ్బ నుంచి కదిరి వరకు 4 లైన్ హైవేను రూ. 707 కోట్లతో నిర్మించనున్నారు. అనంతపురం, బెంగళూరులను అనుసంధానం చేసే రోడ్లను మలకవేముల క్రాస్ దగ్గర కలుస్తాయి. అక్కడి నుంచి నేరుగా విజయవాడకు వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. అనంతపురం నుంచి కళ్యాణదుర్గానికి నాలుగు లైన్ల రోడ్డు కూడా ప్రతిపాదించారు. అనంతపురం నుంచి ఉరవకొండకు రోడ్డు ప్రతిపాదన కన్సల్టేషన్ స్థాయిలో ఉంది. గుత్తి - కర్ణాటకలోని బీదర్ హైవే విస్తరణ కూడా చేపట్టారు.

అలాగే రూ.230 కోట్లతో గుంతకల్లు - బళ్లారి రోడ్డు విస్తరణకు కొత్తగా టెండర్ పిలిచారు. రాయదుర్గంలో రూ.54 కోట్లతో రైల్వే బ్రిడ్జి, రోడ్డు విస్తరణ పనులు మొదలుకానున్నాయి. రూ.25 కోట్లతో ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి రోడ్డు విస్తరణకు టెండర్‌లు ఆహ్వానించారు. కదిరిలో రోడ్లు, డ్రైన్లకు సంబంధించి ఇక రూ.30 కోట్లతో పనులు ప్రారంభించనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నేషనల్ హైవే అభివృద్ధి పనులపై ఫోకస్ పెట్టారు. రోడ్ల విస్తరణతో పాటుగా అన్ని పనుల్ని పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయంటున్నారు. మలకవేముల జంక్షన్ కీలకంగా మారుతుందంటున్నారు. ప్రయాణ సమయం తగ్గి అమరావతికి ఐదు గంటల్లో వెళ్లొచ్చంటున్నారు. ప్రస్తుతం బెంగళూరు టు విజయవాడ మధ్య నేషనల్ హైవే-544జీ పనులు కూడా చకచకా సాగుతుండటంతో బెంగళూరు, అనంంతపురం నుంచి అమరావతికి , విజయవాడకు త్వరగా వెళ్లొచ్చు.. ప్రయాణ సమయం తగ్గుతుందని భావిస్తున్నారు.

# ఏపీలో సర్..డర్

తిరుపతి : అధికార పార్టీ అయినా.. అపోజిషన్ లీడర్లు అయినా ఇప్పుడు అందరికీ ఒకటే ఫోబియా. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారాయి.. బెంగాల్‌లో దీదీకి చుక్కలు కనిపిస్తున్నాయి. అటు టీఎంసీ, ఇటు డీఎంకే ఓడటమే కాదు.. రెండు పార్టీల అధినేతలు సీఎంగా ఉండి సొంత సీటులో ఓటమి చవిచూశారు. ఇదంతా సరే. ఆ స్టేట్స్‌లో వాళ్లిద్దరు ఓడితే.. ఏపీలో పార్టీలకు, లీడర్లకు టెన్షన్ ఎందుకనే కదా డౌట్. అక్కడికే వస్తున్నా.. కేంద్రం చేపట్టిన సర్ ప్రక్రియే.. బెంగాల్‌లో గెలుపోటముల్ని డిసైడ్ చేసిందన్న ప్రచారంతో ఢిల్లీ టు అమరావతి.. ఆ సర్ చుట్టూనే రాజకీయాలు చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా ఏపీలో అపోజిషన్‌లో వైసీపీ అయితే ఫుల్ అటెన్షన్ మోడ్‌లోకి వచ్చేసింది. అందరికంటే ముందే సర్ పై తాడేపల్లి క్యాంప్ ఆఫీస్‌లో కీలక సమావేశం నిర్వహించిన జగన్.. లీడర్లకు దిశానిర్దేశం చేశారు. అలర్ట్‌గా ఉండాలని.. ఎక్కడా తమ పార్టీకి చెందిన ఓటర్ల ఓట్లు పోకుండా క్రాస్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-సర్. మరణించిన, చిరునామా మారిన, అలాగే డూప్లికేట్ ఓట్లను తొలగించడం, కొత్త ఓటర్లను నమోదు చేయడం సర్ ముఖ్య ఉద్దేశం. 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేసుకుంటూ, తాజా ఓటర్ల వివరాలు సేకరిస్తూ వస్తున్నారు. బూత్ లెవల్ అధికారులు డోర్ టు డోర్ సర్వే చేస్తున్నారు. ఏపీలో ఈ నెల 15న మొదలైన ఈ ప్రక్రియ వచ్చే నెల 15 వరకు.. నెలరోజుల పాటు కొనసాగుతుంది. బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటికి వచ్చినప్పుడు ఓటర్లు లేకపోతే అంతే సంగతులు. ఈ మాటే అటు పార్టీలకు.. ఇటు లీడర్లకు కంటిమీదు కునుకు లేకుండా చేస్తోంది.

డిసెంబర్‌లో కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియ ఈ ఏడాది జరిగిన రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను తీవ్రంగా ప్రభావితం చేసిందన్న వాదన బలంగా ఉంది. సర్ ప్రక్రియనే కొందరు ముఖ్యనేతల తలరాతలను మార్చేసిందన్న టాక్ వినిపిస్తోంది. సర్ ప్రక్రియ కింద ఒక్క తమిళనాడు రాష్ట్రంలోనే 97లక్షల ఓట్లు తొలగించినట్లు అంచనా. ఈ ఓట్లు తొలగింపు దాదాపు 40 అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపిందని అంటున్నారు. డీఎంకే అధినేత స్టాలిన్ పోటీ చేసిన కొలత్తూరు నియోజకవర్గంలో ఏకంగా లక్షకు పైగా ఓట్లను ఎస్ఐఆర్ ప్రక్రియలో తొలగించారు. ఆయన కొలత్తూరులో 8వేల 795 ఓట్ల తేడాతో ఓడిపోయారు. పెద్దఎత్తున జరిగిన ఓట్లు తొలగింపే కొలత్తూరులో స్టాలిన్‌ను ఓటమి పాలు చేసిందని బలంగా నమ్ముతున్నారు డీఎంకే నేతలు. ఇక పశ్చిమ బెంగాల్‌లో 91 లక్షలకు పైగా ఓట్లు డిలీటయ్యాయి. ఆ స్టేట్‌లోని మొత్తం ఓట్లలో ఇది దాదాపు 12 శాతం. ఒక్క ఓటుతోనే నేతల జాతకాలు, తలరాతలు మారుతున్న పరిస్థితి. అలాంటిది 12 శాతం ఓట్లు లేకుండా పోతే..రిజల్ట్ షాకింగ్‌గా ఎందుకుండవన్న చర్చ జరుగుతోంది. బెంగాల్‌లో 294 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 30 స్థానాల్లో గెలుపు మార్జిన్ కంటే, అక్కడ తొలగించిన ఓట్లే ఎక్కువ. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ పోటీ చేసిన భవానీపూర్‌లో 50 వేల ఓట్లు డిలీట్ అయ్యాయట. ఆమె 15 వేల ఓట్లతో ఓడిపోయారు. ఆ రెండు రాష్ట్రాల్లో జరిగిన ఓట్ల తొలగింపు..ఫలితాలు తారుమారైన సీన్‌ను గుర్తు చేసుకుంటే చాలు..ఏపీల పార్టీలకు వణుకు పుడుతోందటబెంగాల్, తమిళనాడు ఎన్నికలకు ముందు ా.ఎ.ఖీపై ఏ పార్టీ పెద్ద సీరియస్‌గా కాన్సన్‌ట్రేట్ చేయలేదు. వన్స్ అక్కడ సీన్ మారిపోవడంతో ఏకంగా వరుసపెట్టి సమావేశాలు నిర్వహిస్తూ క్యాడర్‌ను అలర్ట్ చేస్తున్నాయి పార్టీలు. సిట్టింగ్ ఎమ్మెల్యేలే కాకుండా ప్రతిపక్ష నేతలు తమ అనుచరులను.. సర్ ప్రక్రియ చేపడుతున్న సిబ్బంది వెంట తిప్పుతున్నారు. బూత్ లెవల్ ఏజెంట్లను యాక్టివ్ చేస్తున్నారు. ఏ ఓటు తీసేస్తున్నారు.? ఏ ఓటు కలుపుతున్నారన్న దానిపై నాయకులు ఏ రోజుకు ఆ రోజు డేటా తెప్పించుకుని పరిశీలిస్తున్నారట. ముఖ్యంగా గత ఎన్నికల్లో తక్కువ మార్జిన్‌తో అంటే ఐదు నుంచి పదివేలలోపు ఓట్ల తేడాతో విజయం సాధించిన నేతల గుండెల్లో ఎస్ఐఆర్ గుబులు రేపుతోందట. ఈ ప్రక్రియ వచ్చే ఎన్నికల ఫలితాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్న కంగారు నాయకుల్లో మొదలైంది. అర్బన్ ఏరియాల్లో కంటే రూరల్ ఏరియాలోని దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. చాలామంది గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ఓటర్లు ఉపాధి కోసం లేక వివిధ పనుల నిమిత్తం దగ్గరలో ఉన్న నగరాలకు వెళ్తుంటారు.

సర్ ప్రక్రియ కోసం సిబ్బంది ఇంటికి వెళ్లినప్పుడు..డోర్ లాక్ చేసి ఉంటే ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు. తాము ఊర్లోనే నివసిస్తున్నామని రుజువు చూపిస్తే తప్ప ఓటు నిలబడే అవకాశం లేదట.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు అధికార పార్టీ నేతలు అయితే ఎన్నికల సిబ్బంది వెంట తమ షాడో టీమ్‌లను పంపిస్తున్నారు. తమకు అనుకూలమైన ఓటర్లను తొలగించడానికి సిద్ధపడితే వెంటనే అడ్డు చెబుతున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందికి కూడా ఇది కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది.

# ముద్రగడకు భరోసా ఎవరు

కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒకప్పుడు చక్రం తిప్పిన సీనియర్ కాపు నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న ముద్రగడ అస్వస్థతకు గురికావడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రి యశోదకు తరలించారు. అయితే, అక్కడ వైద్య ఖర్చులు ఊహించని స్థాయిలో ఉండటంతో.. ఆ బిల్లులు భరించలేక రాత్రికి రాత్రే ఆయనను సమీపంలోని ఒక చిన్న ప్రైవేట్ ఆస్పత్రికి మార్చడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ముద్రగడను కేవలం రాజకీయ అవసరాల కోసమే వాడుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , ఇప్పుడు ఆయన వైద్యానికి కనీస భరోసా ఇవ్వకపోవడంపై ముద్రగడ అనుచరులలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత సార్వత్రిక ఎన్నికల నుంచి వైసీపీకి కాపు అస్త్రంగా ముద్రగడ ఉపయోగపడ్డారు. ఆయనకు ఇష్టం లేకపోయినా, వయసు సహకరించకపోయినా.. ఆయన కుమారుడికి రాజకీయ ప్రాధాన్యత ఇస్తామంటూ, భవిష్యత్తు బాగుంటుందంటూ వైసీపీ అగ్రనాయకత్వం ముద్రగడను ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. చంద్రబాబు నాయుడిని, ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ ముద్రగడతో ఘాటైన లేఖలు రాయించడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించడం, ఆఖరికి అనారోగ్యంతో ఉన్నా బలవంతంగా వీడియో బైట్స్ విడుదల చేయించడం వెనుక వైసీపీ వ్యూహకర్తలే ఉన్నారన్నది బహిరంగ రహస్యం. తాజాగా సాయికృష్ణ ఉదంతంలో ఆయనతో ఓ లేఖ రాయించేందుకు ప్రయత్నించారు. కానీ ఈలోపే ఆయన ఆసుపత్రి పాలవ్వడంతో కథ అడ్డం తిరిగింది. హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముద్రగడ వైద్య ఖర్చుల విషయంలో సాయం కోరేందుకు ఆయన కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు తాడేపల్లి ప్యాలెస్‌ను, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిని సంప్రదించేందుకు గట్టిగానే ప్రయత్నించినట్లు సమాచారం. అయితే, ఈ సంప్రదింపుల ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయని టాక్. అసలు ఎవరూ పట్టించుకోలేదు.

కార్పొరేట్ ఆసుపత్రి భారీ ఖర్చులకు సంబంధించిన ఆర్థిక భరోసా లేదా సాయంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని తెలుస్తోంది. ముద్రగడ పద్మనాభం లాంటి ఒక సీనియర్ లీడర్‌ను ఆపద సమయంలో వైసీపీ ఒంటరిని చేసిందనే వార్త గోదావరి జిల్లాల్లోని కాపు శ్రేణులను తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోంది. అవసరమైనప్పుడు పవన్ కల్యాణ్‌పైకి ఉసిగొల్పి.. పంతానికి పోయి పేరు మార్చుకునే దాకా ముద్రగడను వాడుకుని, ఇప్పుడు వైద్యం చేయించుకునే పరిస్థితి వస్తే చేతులెత్తేస్తారా అంటూ క్షేత్రస్థాయి అనుచరులు మండిపడుతున్నారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను తిట్టడానికే ముద్రగడ పనికొచ్చారా.. ఆయన ప్రాణాల కంటే పార్టీ ప్రయోజనాలే ఎక్కువయ్యాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి. ఓ వైపు ముద్రగడ ఆరోగ్యపరిస్థితి బాగోలేక ఆస్పత్రిలో ఉంటే కాపు నాయకుల పేరుతో తోట త్రిమూర్తులు వంటి వారు హడావుడి ప్రారంభించారు.

## ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన



బాలాపూర్, మహేశ్వరం, జూన్ 23,(ప్రజా కలం). సిపిఐ పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కామ్రేడ్ డాక్టర్ నారాయణ తో బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన సర్ ఓట్ల తొలగింపు ను నిరసిస్తూ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ మండల మహిళా ప్రధాన కార్యదర్శి బి యాదమ్మ సిపిఐ సీనియర్ నాయకుడు లక్ష్మారెడ్డి ఇందిరా నగర్ శాఖ కార్యదర్శి వీరస్వామి గిరిజన సమాఖ్య జిల్లా ట్రెజరర్ శత్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## శామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి

బాలాపూర్, మహేశ్వరం, జూన్ 23,(ప్రజా కలం) జిహెచ్ఎంసి 58 ప్రశాంతి హిల్స్ డివిజన్ లో భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి



ఆధ్వర్యంలో డా శామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా బాలాపూర్ చౌరస్తా వద్ద వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ఘనంగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బిక్షపతి చారి మాట్లాడుతూ ఒకే దేశము లో రెండు రాజ్యాంగాలు ఒకే దేశము లో రెండు ప్రధానులు ఉ ఒడకూడదు అని నినదించిన మహానుభావుడు మరియు భారతీయ జన్ సంఘ్ పార్టీ వ్యవస్థాపకులు ప్రముఖ భారతీయ విద్యా వేత్త రాజకీయ మేధావి డా.. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఈ కార్యక్రమనికి బిజెపి ప్రధాన కార్యదర్శి ఇంద్రావతి రవి నాయక్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు చేవ్వ శ్రావణ్. జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి ముదిరాజ్ గాజుల మధు విక్కీసాగర్ రాఘవేందర్ గౌడ్ బిజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ఇందిరమ్మ ఇండ్ల గ్రామపంచాయతీ ఆధీనంలోనే ఉండాలి'.. అక్కారం గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం



గజ్వేల్ : 23 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అక్కారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ గ్రామస్తులు అధికారులను నిలదీశారు. అర్హులైన పేదలకు ఇండ్లు అందడం లేదని, నాయకుల అనుచరులకే ఇండ్లను కేటాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామసభలో పలువురు గ్రామస్తులు అధికారులను ప్రశ్నించడంతో కొంతసేపు రసాభాస పరిస్థితులు నెలకొన్నాయి. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి, నిజమైన అర్హులకే లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.అధికారుల వివరాల ప్రకారం, అక్కారం గ్రామానికి మొత్తం 25 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారు. వీటిలో గత ప్రభుత్వ హయాంలో 19 ఇండ్లను నిరుపేదలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన ఆరు ఇండ్లు అసంపూర్తిగా ఉండటంతో వాటిని ప్రస్తుతం అర్హులైన లబ్ధిదారులకు కేటాయించే అంశంపై గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామానికి కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లు గ్రామపంచాయతీ ఆధీనంలోనే ఉండాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం ఆ తీర్మాన పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ప్రక్రియలో ఎలాంటి వివక్షకు తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని గ్రామస్తులు మరోసారి అధికారులను కోరారు.

## మైలార్‌దేవ్‌పల్లి లో ఘనంగా ఓటర్ల జాబితా సవరణ

### బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ శిబిరంలో పాల్గొన్న రాజేంద్రనగర్ శాసనసభ్యులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, జూన్ 23, (ప్రజా కలం)

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాజేంద్రనగర్ నియోజకవర్గ స్థాయి అవగాహన శిక్షణ శిబిరం




ఈరోజు మహిళార్ దేవరపల్లిలోని దుర్గా కన్వెన్షన్ హాల్‌లో అత్యంత విజయవంతంగా నిర్వహించారు.రాజేంద్రనగర్ శాసనసభ్యులు ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణ కార్యక్రమానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) చామల కిరణ్ కుమార్ రెడ్డ , మరియు విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఎస్ ఐ ఆర్ పై ఎంపి చానా కిరణ్ కుమార్ రెడ్డి గారు బి ఎల్ ఏ లకు అవగాహన కల్పించారు తదుపరి విజయ డైరీ చైర్మన్ అమిత్ రెడ్డి గారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ బిఎల్ఏలకు ఎస్ఐఆర్ పై పూర్తి అవగాహన కల్పించి శిక్షణను ఇచ్చారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై ఏజెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి రాబోయే రోజుల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎజజ7ఈ శిక్షణా శిబిరంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రజల నిరసన

## - మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా

సిద్దిపేట : జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో విలీనమైన మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజలను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ, ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్వాసితులు మున్సిపల్ కార్యాలయం ముందు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. నిర్వాసితుల న్యాయమైన పోరాటానికి మద్దతుగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు, దామరంచ ప్రతాప్ రెడ్డి, పెద్ది బాలకిషన్, చింత కింది కనకయ్య, గూడూరి రాములు, నిర్వాసితుల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రాజెక్టుల కోసం సర్వస్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల ప్రజల పట్ల ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు సానుభూతితో వ్యవహరించాలని కోరారు. మున్సిపాలిటీలో విలీనమైన ముంపు గ్రామాల ప్రజలకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పరిహారం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థిరమైన ఉపాధి అవకాశాలు లేక, పరిహారం అందక నిర్వాసితులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నిర్వాసితులు తమ అవసరాల కోసం కట్టుకుంటున్న ఇళ్లను, ఇతర నిర్మాణాలను అధికారులు కూల్చివేయడం అత్యంత అమానుష చర్య అని నాయకులు మండిపడ్డారు. నిర్వాసితుల త్యాగాల వల్లనే ఈరోజు తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందనే నిజాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. గ్రామాలను ఖాళీ చేసే సమయంలో ఈ ప్రాంతాలను పంచాయతీలుగానే కొనసాగిస్తామని, ఒకవేళ మున్సిపాలిటీలో విలీనం చేస్తే 10 సంవత్సరాల వరకు పన్ను మినహాయింపు కల్పిస్తామని



అప్పటి ప్రభుత్వం మౌఖికంగా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ఈ లోపే ప్రభుత్వం మారడంతో నిర్వాసితులు అన్యాయానికి గురయ్యారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మరియు మున్సిపల్ యంత్రాంగం మానవతా దృక్పథంతో ఆలోచించి, విలీన గ్రామాల ప్రజలకు కనీసం 5 నుండి 10 సంవత్సరాల వరకు ఆస్తి పన్ను మినహాయింపు కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులు నివాస గృహాలు నిర్మించుకునేందుకు ప్రత్యేక నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని వెంటనే విడుదల చేసి వారి జీవనోపాధికి పూర్తి భరోసా కల్పించాలని నాయకులు సవినయంగా ప్రార్థించారు. లేనిపక్షంలో నిర్వాసితుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముంపు గ్రామాల బాధితులు, ఆర్ అండ్ ఆర్ కాలనీ నివాసితులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుపై దాడి

## - నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

## - జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసిన జర్నలిస్టులు



మెదక్ జూన్ 23(ప్రజాకలం ప్రతినిధి) మెదక్ జిల్లా రామయంపేట్ నార్సింగ్ మండల మన తెలంగాణ విలేకరి శ్రీ రాఘవేందర్ పై జరిగిన దాడి ఘటనను మెదక్ జిల్లా జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు, పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే చర్యగా అభివర్ణించారు. దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం బాధితునితో కలిసి మెదక్ జిల్లా జర్నలిస్టులు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి, టీయూడబ్ల్యూజె (143) జిల్లా నేత సురేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులకు గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసిన అంశంపై వార్త ప్రచురించిన నేపథ్యంలో విలేకరి రాఘవేందర్‌పై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు వారు పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడం జర్నలిస్టుల విధి అని, తమ వృత్తి బాధ్యతలను నిర్వర్తించే మీడియా ప్రతినిధులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్థంభంగా గుర్తింపు పొందిందని, సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఇటువంటి దాడులు జర్నలిస్టుల్లో భయాందోళనలు కలిగించడమే కాకుండా పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే ప్రమాదం ఉందన్నారు. రాఘవేందర్‌పై జరిగిన దాడి ఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ చేపట్టి, దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేసును అత్యంత ప్రాధాన్యతగా పరిగణించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.మీడియా ప్రతినిధుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఉపేక్షించరాదని తెలిపారు. జర్నలిస్టులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, తిమ్మన్నగారి శ్రీధర్, నాగరాజు శర్మ, హుస్సేన్, బొందుగుల నాగరాజు, ముచ్చనవీన్, గోపాల్ గౌడ్,కామాటి కృష్ణ, లక్ష్మి నారాయణ, పాపన్నపేట శ్రీనివాస్, శ్రీనివాస్ చారి, సందీప్, గోవర్ధన్ రెడ్డి, నీలం, చల్ల రాహుల్, రాఘవులు, మల్లేష్, కార్తీక్, శ్రీహరి, సంగమేష్, రహమాత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## రిపోర్టర్ నర్సింలు ను పరామర్శించిన గోలి సంతోష్ గుప్తా

### - కన్నీరు మునీరుగా విలపిస్తున్న నర్సింలు కుటుంబ సభ్యులు

గజ్వేల్:23 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి) సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బంగ్లా వెంకటపూర్ గ్రామానికి చెందిన రిపోర్టర్ నర్సింలు రెండవ కుమార్తె రాగిని ఇటీవల ఆత్మహత్య చేసుకుని మరణించగా మంగళవారం రిపోర్టర్ నర్సింలు ను పరామర్శించిన బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు, ఫర్టిలైజర్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గోలి సంతోష్, నర్సింలు ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, చిన్నారి రాగిని మరణం బాధాకరం అని క్షణిక ఆవేశంలో ఆత్మహత్య చేసుకోవడం తల్లి తండ్రులకు శోకం తప్ప ఏమి లేదని, యువతి యువకులు చదువు మీద దృష్టి పెట్టి,ఉన్నత శిఖరాలు చేరుకోవాలని అన్నారు,నర్సింలు కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి MKF ట్రస్ట్ ఆర్థిక సహాయం

నిజామాబాద్,8(ప్రజా కలం ప్రతినిధి) జూన్ 22:



సామాజిక సేవలో నిరంతరం ముందుండే ప్రముఖ స్వచ్ఛంద సంస్థ 'MKF ట్రస్ట్' మరోసారి తన మానవత్వాన్ని చాటుకుంది. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం మోర్తాడ్ గ్రామానికి చెందిన దాసరి సాయి కుమార్ ఇటీవల జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారు. కంటికి రెప్పలా కాపాడాల్సిన యజమానిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు వీఖఫీ ట్రస్ట్ ముందుకు వచ్చింది. MKF ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎర్రం తేజా పటేల్ ఆదేశాల మేరకు ట్రస్ట్ ప్రతినిధులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సాయి కుమార్ అకాల మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి కొండంత అండగా నిలిచారు. ట్రస్ట్ తరపున తక్షణ సహాయంగా నగదు రూపంలో ఆర్థిక సహాయంతో పాటు, ఒక బియ్యం బ్యాగ్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ.. విపత్కర పరిస్థితుల్లో, ఆపదలో ఉన్న పేద కుటుంబాల కు అండగా నిలవడం తమ ట్రస్ట్ యొక్క ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. మానవతా విలువలను కాపాడుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్నింటిని కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. ఈ సహాయ వితరణ కార్యక్రమంలో MKF ట్రస్ట్ సభ్యులు ఎర్రం సాయి చందర్, ఒడ్నాల శ్రీకాంత్, యెనుగంటి శ్రీకాంత్, జిన్నా ప్రశాంత్ మరియు తెడ్డు చిరంజీవి తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. క్లిష్ట సమయంలో స్పందించి సహాయం చేసిన ట్రస్ట్ నిర్వాహకులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# మూడు సముద్రాలపై భారత్ పట్టు

ముంబై : ఆకాశం, నీరు, నిప్పు.. ఈ మూడింటి ఆధారంగానే మనిషి మనుగడ సాగుతూ ఉంటుంది. వీటి మీద పట్టు చిక్కితే మనిషి జీవితం సులభం అవుతుంది. మనిషి అంటే కేవలం ఒకరు మాత్రమే కాదు.. ఈ యావత్ ప్రపంచం. నిప్పు మీద పట్టును కాస్త పక్కన పెడితే.. గగనం.. సంద్రం మీద పట్టు సాధించిన వారే గొప్పగా మనుగడ సాగిస్తూ ఉంటారు.ప్పటివరకు ప్రపంచంలో అమెరికా.. రష్యా.. చైనా.. ఇంకా కొన్ని దేశాలు గగనతలం మీద పట్టు సాధించాయి.. సముద్రంలో కూడా సత్తా చాటాయి. అందువల్లే ఈ దేశాలకు ప్రపంచం మీద పెత్తనం ఎక్కువగా ఉంటుంది. అవి ఏం చెప్తే అదే చేయాలి. ఎలాంటి ఆదేశాలిస్తే వాటిని పాటించాలి.. అయితే ఇప్పుడు భారత్ వాటి సరసన చేరింది. మరి కొద్ది రోజుల్లో అయితే వాటిని మించిపోతుంది. దీనికి ప్రధాన కారణం దేశ ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయాలు.గడచిన కొంతకాలంగా మన దేశ నౌకాదళ వ్యవస్థలోకి 40 యుద్ధ.. సర్వే నౌకలు.. జలాంతర్గాములు వచ్చాయి. ఇంకా 45 తదుపరి దశలో ఉన్నాయి. అంతేకాదు అత్యాధునిక స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన స్టెల్త్ ఫ్రీగేట్ ఐఎన్ఎస్ దునగిరి, సర్వే నౌక, ఐఎన్ఎస్ సంషోదక్, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధనౌక ఐఎన్ఎస్ అగ్రయ్ అనే మూడు నౌకలను ప్రధానమంత్రి ప్రారంభించారు. కోల్ కతా లోని శామ ప్రసాద్ ముఖర్జీ పోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో వీటిని జాతికి అంకితం చేశారు. ఈ మూడు నౌకలు అత్యంత ప్రత్యేకమైనవి. వీటివల్ల మన నౌకాదళం మరింత బలాన్ని పెంచుకుందిఇది అత్యంత పెద్దది. స్టెల్త్ ఫ్రిగేట్ విభాగంలో ఇది బాహుబలి లాగా ఉంటుంది. శత్రువుల రాడార్లు.. సెన్సార్లకు ఏమాత్రం చిక్కదు. పైగా ఇది అత్యాధునిక టెక్నాలజీతో పనిచేస్తూ ఉంటుంది. మన నౌకా దళంలో ఐఎన్ఎస్ నీలగిరికి ప్రత్యేకమైన పేరు ఉంది. ఈ ప్రాజెక్టు 17 ఏ లో భాగంగానే దీనిని నిర్మించారు. ఇందులో బ్రహ్మోస్ మిస్సైల్స్.. మిడిల్ రేంజ్ మిస్సైల్స్.. మల్టీ ఫంక్షన్ సర్వే లైన్స్.. ట్రాక్ గైడెన్స్ రాడార్.. సోనార్ సెన్సార్లు.. ఎలక్ట్రానిక్ వార్ ఫెయిర్ వ్యవస్థలు ఇందులో ఉంటాయి. ఇది ఏకంగా 149 మీటర్ల పొడవు..6670 టన్నుల బరువు ఉంటుంది. ఇది గంటకు 52 కిలోమీటర్ల వేగంతో



దూసుకుపోతుందిఇది హై అండ్ టెక్నాలజీ తో రూపొందించిన హైడ్రోగ్రాఫిక్ సర్వే నౌక. ఇది పూర్తిగా సముద్ర గర్భాన్ని మ్యాపింగ్ చేస్తూ ఉంటుంది. మహా సముద్రాల లోతును కొలుస్తూ ఉంటుంది. సముద్ర మార్గాలను నిత్యం అన్వేషిస్తూ ఉంటుంది. దీని పొడవు 110 మీటర్లు. బరువు 3400 టన్నులు ఉంటుంది. ఇది గంటకు 18 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణం సాగిస్తూ ఉంటుంది. దీనిని దేశ అవసరాల కోసం ఉపయోగించుకోవచ్చు. నీటి అడుగున ఇది మ్యాపింగ్ చేస్తూ ఉంటుంది. దూర ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తూ ఉంటుంది. అటానమస్ అండర్ వాటర్ వాహకాలు ఇందులో ప్రత్యేకంగా ఉన్నాయి. మనుషులు లేకుండానే దీని ద్వారా సముద్ర అంతర్భాగంలో పరిశోధనలు సులభంగా చేయవచ్చుదునగిరి, సంషోదక్ వంటి వాటితో పోల్చి చూస్తే అగ్రయ్ అత్యంత చిన్న నౌక.. ఇది పూర్తిగా జలాంతర్గామి విధ్వంసక యుద్ధ నౌక. ఇది శత్రు జలాంతర్గములను గుర్తిస్తూ ఉంటుంది. వాటిని నిత్యం ట్రాక్ చేస్తూ ఉంటుంది. తేలికపాటి టార్పెడో లేదా రాకెట్ల ద్వారా వాటిని ఇది ధ్వంసం చేస్తూ ఉంటుంది. ఇందులో షాలో వాటర్ సోనర్ వ్యవస్థ ఉంటుంది. ఇది అత్యంత కఠినమైన జలాల్లో కూడా పనిచేస్తూ ఉంటుంది.

## బీజేపీలో చేరిన ఎల్ఐసీ నరసింహులు..!

సి.బెళగల్ : భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, కోడుమూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ టీటీడీ పాలక మండలి సభ్యులు పరిగెల మురళీకృష్ణ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, సి.బెళగల్ మండలం గుండ్రేవుల గ్రామానికి చెందిన ఎల్ఐసీ నరసింహులు శనివారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పరిగెల మురళీకృష్ణ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరిగెల మురళీకృష్ణ మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ దేశాభివృద్ధి, జాతీయత, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకు సాగుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యే లా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపే వంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఎల్ఐసీ నరసింహులు పార్టీ సిద్ధాంతాలు, ప్రధాని నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న తీరు, అలాగే పరిగెల మురళీకృష్ణ ప్రజాసేవా దృక్పథం తనను ఆకర్షించాయని పేర్కొన్నారు.

## చెక్ డ్యామ్ లో గుర్తు తెలియని
# మహిళ మృతదేహం లభ్యం



మెదక్ జూన్ 23(ప్రజాకలం ప్రతినిధి)

పాపన్నపేట మండలం ఏడుపాయల దుర్గామాత ఆలయ సమీపంలో ఉన్న చెక్ డ్యామ్ లో మంగళవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు పాపన్న పేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ చెక్ డ్యాంలో ఓ మహిళ మృతదేహం గమనించి స్థానికులు పాపన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని వెలికి తీసి మృతురాలి ఆచూకీ కోసం పరిశీలించగా ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదు. మృతురాలి దేహం పై బ్లూ కలర్ నైటీతో పాటు, చెవులకు రేడిమెట్ కమ్మలు, ముక్కు పుడక ఉంది.మృతురాలి ఫోటో ఆధారంగా మృతురాలిని గుర్తించిన వారు పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ ఫోన్ నెంబర్ 87126 57920, రూరల్ సీఐ కృష్ణమూర్తి 87126 57883 లకు సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న సుల్తాన్ పల్లి ఈసి వాగును పరిశీలించిన ఫ్యూచర్ సిటీ కమీషనర్ ఐపిఎస్ తరుణ్ జోషి

- గ్రామస్తులు లోతట్టు ప్రాంతాలకు కరెంట్ పోల్స్ కి దూరంగా ఉండాలి
- శంషాబాద్ సి ఐ నరేందర్ రెడ్డి



శంషాబాద్, జూన్ 23, (ప్రజా కలం) రాత్రి కురిసిన వర్షానికి గాను సుల్తాన్ పల్లి గ్రామ పరిధిలోని ఈసి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సుల్తాన్ పల్లి నుండి మొయినాబాద్ కు వెళ్ళు మార్గం మొత్తం నీటిలో మునిగిపోయినది. 23 నాడు ఫ్యూచర్ సిటీ కమీషనర్ తరుణ్ జోషి ఐ పి ఎస్ చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్ ఐ పి ఎస్ శంషాబాద్ పిఎస్ ఎస్ హెచ్ ఓ నరేందర్ రెడ్డి శంషాబాద్ పోలీసు సిబ్బంది అందరూ కూడా సుల్తాన్ పల్లి వాగు ను సందర్శించి వాగు దగ్గరికి ప్రజలను వెళ్లనివ్వకుండా అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు.తర్వాత ఫ్యూచర్ సిటీ కమీషనర్ తరుణ్ జోషి గ్రామస్తులను ఉద్దేశించి రైని సీజన్ ఉ ండడంతో గ్రామస్తులు లోతట్టు ప్రాంతాలకు, కరెంట్ పోల్స్ కి దూరంగా ఉ ండాలని సూచనలు ఇవ్వడం జరిగింది. పాత బడి ఉన్న ఇండ్లను వదిలి సురక్షితమైన ప్రాంతానికి వెళ్ళాలని చిన్న పిల్లలను కరెంట్ పోల్స్ దగ్గరికి వెళ్లనివ్వకుండా చూసుకోవాలని, ఏదైనా ఎమర్జెన్సీ ఉంటే వెంటనే డయల్ 112 కి కాల్ చేయాలని సూచించారు.

## విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలి: కలెక్టర్ హైమావతి.



సిద్దిపేట ప్రజాకలం జూన్ 23. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కిచెన్‌లో వండుతున్న ఆహార పదార్థాలను తనిఖీ చేసిన కలెక్టర్ అన్నం, బీట్రూట్ కూర, పప్పు, సాంబార్‌ల నాణ్యతను పరిశీలించి రుచి చూశారు. ప్రతి వంటకాన్ని శుభ్రతతో, రుచికరంగా తయారు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించబోమని వంట సిబ్బందిని హెచ్చరించారు. వంటగది, పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు ఆధారంగా అవసరమైన వంట సరుకులు, కూరగాయలను ప్రామాణిక పరిమాణంలో వినియోగించి నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

## అంగన్వాడీ చిన్నారులకు యూనిఫాంల పంపిణీ.

సిద్దిపేట ప్రజాకలం జూన్ 23. మండల పరిధిలోని మాచిన్‌పల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు యూనిఫాంలను పంపిణీ చేశారు సర్పంచ్ బొక్కల నాగరాజు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల విద్యాభివృద్ధికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు మెరుగైన పోషకాహారం, ప్రాథమిక విద్య అందించడం జరుగుతోందని చెప్పారు. చిన్నారులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రాధిక, పద్మ, ఉపసర్పంచ్ కవిత, వార్డు సభ్యులు శివలింగం, నాగరాజు, రామచంద్రం, మల్లేశం, కోటి, మహేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- సంగారెడ్డి నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు లకుడారం మాణిక్ ప్రభు డిమాండ్

సంగారెడ్డి ప్రతినిధి జూన్ 23 (ప్రజా కలం): నాయి బ్రాహ్మణుల అభివృద్ధి కోసం ప్రత్యేక నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని సంగారెడ్డి నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు లకుడారం మాణిక్ ప్రభు డిమాండ్ చేశారు. సంగారెడ్డి పట్టణంలోని రెవెన్యూ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన నాయి బ్రాహ్మణ సేవా సంఘం సర్వసభ్య సమావేశంలో మంగళవారం వారు అధ్యక్షత వహించి మాట్లాడారు. అనాదిగా అసమానతలు ఎదుర్కొంటున్న నాయి బ్రాహ్మణుల ఉన్నతి కోసం రాష్ట్రంలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి చేయూత ఇవ్వాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. దేవాలయాలలో సేవలందిస్తున్న నాయి బ్రాహ్మణులను గుర్తించి దేవాలయ కమిటీలల్లో నాయి సంఘీయులను డైరెక్టర్ గా నియమించాలని సూచించారు. సమాజంలోని ప్రజల ఆరోగ్యం పరిశుభ్రతలో నాయి బ్రాహ్మణుల పాత్ర కీలకమని తెలిపారు. ప్రాచీన కాలం నుండి క్షౌరవృత్తి చేస్తూ సమాజానికి విశేష సేవలు అందిస్తున్న ఘనత నాయి బ్రాహ్మణులకు దక్కుతుందన్నారు. నేడు కార్పొరేట్ సంస్థలు క్షౌరవృత్తి అవుట్లెట్లను ఏర్పాటు చేస్తూ నాయి బ్రాహ్మణుల జీవనోపాధిని దెబ్బతీయడం తగదని విమర్శించారు. ప్రభుత్వంలోని పెద్దలు ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా నాయి బ్రాహ్మణులే క్షౌరవృత్తి



చేపట్టేలా నిబంధనలు రూపొందించాలని కోరారు. క్షౌరవృత్తిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించేలా నాయి బ్రాహ్మణ పురుషులకు, మహిళలకు ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 50 సంవత్సరాలు పైబడిన వారికి ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ గౌరవ అధ్యక్షులు దత్తాత్రి, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, కార్యనిర్వాహక అధ్యక్షులు సాయినాథ్, యూత్ కమిటీ గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు, అధ్యక్షులు చరణ్, ప్రధాన కార్యదర్శి రాము, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, మురళి, స్వాగత్ ప్రభు, పెంటయ్య, హనుమంతు, సాయి కిరణ్, ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు యాదయ్య, ప్రధాన కార్యదర్శి సుకుమార్, సత్యనారాయణ, మహిళ కమిటీ సభ్యులు సుధామణి, పద్మావతి, పట్టణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాయపోల్ మండలంలో విత్తన మేళా నిర్వహణ

## - రైతులకు ఎల్‌నినోపై అవగాహన



సిద్దిపేట ప్రజాకలం జూన్ 23.సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలోని రాయపోల్, ఆరేపల్లి, చిన్నమాసనపల్లి, వడ్డేపల్లి రైతు వేదికలలో సోమవారం విత్తన మేళా నిర్వహించారు. రాయపోల్ రైతు వేదికలో జరిగిన కార్యక్రమాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య, రాయపోల్ గ్రామ సర్పంచ్ రాజు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు 7 రకాల సన్న వరి విత్తనాలు, కంది, పెసర, కూరగాయల పంటల విత్తనాలు, నానో యూరియా, నానో డీఏపీ తదితర వ్యవసాయ ఉ త్పత్తులను అందుబాటులో ఉంచారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. అలాగే ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఎల్‌నినో కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున తక్కువ కాల వ్యవధిలో పండే పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎల్‌నినోకు సంబంధించిన అవగాహన పోస్టర్లను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కనకయ్య, సర్పంచ్ రాజు ఆవిష్కరించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ కాల పరిమితి ఉన్న పంటలకు సంబంధించిన విత్తనాలను కూడా విత్తన మేళాలో రైతులకు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతులు విత్తన మేళాను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలను పొందాలని అధికారులు కోరారు.

# సికింద్రాబాద్ కాంగ్రెస్‌లో ప్రోటోకాల్' రచ్చ

### ఇందిరమ్మ చీరల పంపిణీలో బహిరంగంగా తలపడ్డ కాంగ్రెస్ నేతలు

సికింద్రాబాద్, జూన్ 23 :ప్రజాకలం ప్రతినిధి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఉత్సాహంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి సికింద్రాబాద్ నియోజకవర్గంలో తలెత్తుతున్న అంతర్గత విభేదాలు, గ్రూపు రాజకీయాలు పెద్ద తలనొప్పిగా మారాయి. నియోజకవర్గ పరిధిలోని కీలక నేతల మధ్య సమన్వయం లోపించడం, ఆధిపత్య పోరు సాగించడం పార్టీ శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది. తాజాగా మాణికేశ్వర్ నగర్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఇందుకు వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, సికింద్రాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ వర్గాల మధ్య ప్రోటోకాల్ వివాదం తారస్థాయికి చేరి బహిరంగ వాగ్వాదానికి దారితీసింది.

మహిళా సంఘాల సభ్యులకు చీరలు పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆదం సంతోష్ కుమార్ ముందే చేరుకున్నారు. ముఖ్య అతిథి రాక కోసం కొంత సమయం వేచి చూసిన ఆయన, అనంతరం పంపిణీని ప్రారంభించారు. అయితే, కార్యక్రమం మొదలైన కొద్దిసేపటికే అక్కడికి చేరుకున్న మోతె శ్రీలత శోభన్ రెడ్డి.. ముఖ్య అతిథిగా వచ్చే తనను కాదని, ప్రోటోకాల్‌ను విస్మరించి కార్యక్రమాన్ని ఎలా మొదలుపెడతారంటూ అధికారులపై, స్థానిక నేతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీలతా రెడ్డి రావడం ఆలస్యం కావడం వల్లే పంపిణీ ప్రారంభించాల్సి వచ్చిందని సంతోష్ కుమార్ వివరణ ఇచ్చే ప్రయత్నం చేసినప్పటికీ, ఇరు నేతల మధ్య మాట మాట పెరిగి తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు ఘాటైన వ్యాఖ్యలు చేసుకోవడంతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.చివరకు తోటి



నాయకులు, కార్యకర్తలు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో ఇద్దరు నేతలు కలిసి చీరలు పంపిణీ చేసినప్పటికీ, ఇరువర్గాల మధ్య అసంతృప్తి జ్వాలలు అలాగే ఉండిపోయాయి.ఇదిలా ఉండగా, నియోజకవర్గంలో ఇలాంటి గ్రూపు తగాదాలు రోజురోజుకూ పెచ్చరిల్లడానికి సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ప్రెసిడెంట్ దీపక్ జాన్ నాయకత్వ వైఫల్యమే కారణమంటూ సొంత పార్టీలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివాదాలను సర్దిచెప్పి, నేతలందరినీ ఒకే తాటిపైకి తీసుకురావాల్సిన డీసీసీ అధ్యక్షుడికి స్థానిక నాయకులు,కార్యకర్తలపై పట్టు లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా సనత్ నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ తనను స్టేజీపై నుంచి దించేశారంటూ ఓ మహిళా కార్యకర్త డీసీసీ ప్రెసిడెంట్‌ను బహిరంగంగానే నిలదీసిన ఉదంతాన్ని ఈ సందర్భంగా పలువురు గుర్తు చేస్తున్నారు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా సాగుతున్న సికింద్రాబాద్ కాంగ్రెస్ గ్రూపు రాజకీయాన్ని అధిష్ఠానం ఇప్పటికైనా చక్కదిద్దకపోతే రాబోయే రోజుల్లో పార్టీకి భారీ నష్టం వాటిల్లే ప్రమాద ముందని క్షేత్రస్థాయి కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్



మహేశ్వరం, జూన్ 23, (ప్రజా కలం) రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలో ఫీజులు నియంత్రించాలని ఈరోజు ఏబీవీపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో పాఠశాల బంద్ పిలుపును ఇవ్వడం జరిగింది. దీనిలో భాగంగా ఏబీవీపీ మహేశ్వరం మండలం కేంద్రంలోని ప్రైవేట్ కార్పొరేట్ ప్రభుత్వ పాఠశాలలో బంద్ విజయవంతం జరిగింది. ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై చవితి తల్లి ప్రేమ చూపెడుతుంది విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఎంఈఓ డీఈవో పోస్టులతో పాటు టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్లో విచ్చలవిడి దోపిడిని అరికట్టే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని నెప్పి 2020 అమలు చేయాలని, గురుకుల పాఠశాలకు పక్క భవనాలు నిర్మించాలని అని ఏబీవీపీ డిమాండ్ చేస్తూ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా బందుకు పిలుపును ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఏబీవీపీ ఆల్ ఇండియా కలామచ్ కో కన్వీనర్ మణికంఠ,ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదర్శి రాజేష్,ఎబివిపి గ్రేటర్ హైదరాబాద్ సిటీ జాయింట్ సెక్రెటరీ రాఘవేంద్రం,ఎబివిపి మహేశ్వరం నాయకులు వంశీ,సయ్యద్ ,అభిలాష్ , ప్రణీత్, రోహిత్, సిద్దు,చరణ్,సాయి కార్తీక్,ఉదయ్, హర్ష,తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పద్మారావు కుటుంబ సభ్యులను పరామర్శించిన కేటీఆర్

కూకట్ పల్లి, జూన్ 23, ప్రజా కలం ప్రతినిధి: తెలంగాణ ఉద్యమకారుడు గొట్టిముక్కల పద్మారావు ఇటీవల మరణించిన నేపథ్యంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూకట్ పల్లి లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పద్మారావు అకాల మృతి పట్ల తీవ్ర



విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్ పద్మారావు తెలంగాణ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. పద్మారావు చిత్రపటానికి కేటీఆర్ తో పాటు ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేక్ ఎమ్మెల్సీలు నవీన్ రావు మరియు శంబిపూర్ రాజు పూలమాలవేసి నివాళులు అర్పించారు.

## గాంధీలో బాలింత మృతి, బంధువుల ఆందోళన




సికింద్రాబాద్: జూన్ 23: ప్రజా కలం ప్రతినిధి

గాంధీ ఆసుపత్రిలో బాలింత మృతి కలకలం రేపింది. బోయిన్‌పల్లి హస్మత్‌పేటకు చెందిన కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. సమీనా బేగం(21)కు గతేడాది వివాహమైంది. మొదటి ప్రసూతి కోసం గాంధీ ఆస్పత్రికి వచ్చిన సమీనా ఈరోజు ఉదయం 5:30కి మగ బిడ్డకు జన్మనిచ్చింది. డెలివరీ తర్వాత వైద్య సిబ్బంది పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చనిపోయిందని వారు ఆరోపించారు. ప్రస్తుతం బాబుకు నిలోఫర్‌లో చికిత్స జరుగుతోంది.

# ఆర్డీవో కార్యాలయం నుండి కందుకూరు చౌరస్తా వరకు 2కె రన్

- పాల్గొన్న కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి




కందుకూరు, జూన్ 23,(ప్రజా కలం) ఆర్డీవో కార్యాలయం నుండి కందుకూరు చౌరస్తా వరకు 2కె రన్ కార్యక్రమంలో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. మంగళవారం నాడుఎస్ ఐ ఆర్ ప్రారంభ సన్నద్ధతలో భాగంగా కందుకూరు ఆర్డిఓ , ఈ ఆర్ ఓ ఆఫీస్ నుండి చౌరస్తా వరకు "2కె రన్ " నిర్వహించడం జరిగింది. అనంతరం చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి ఎస్ ఐ ఆర్ ప్రాముఖ్యాన్ని తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ ఈ ఆర్ ఓ కందుకూరు ఆర్డీవో గారు మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ఈనెల 25వ తారీకు నుంచి ప్రారంభమవుతుందని చెప్తూ, ఇంటింటి గణన గురించి, అందరూ ఎన్నుమరేషన్ ఫామ్ ను పూర్తి చేసి బిఎల్ఓ లకు అందించాలని కోరడం జరిగింది. ఎన్నికల సంబంధిత అధికారులందరూ ఎస్ ఐ ఆర్ లో యాక్టివ్ గా పాల్గొనాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కందుకూరు మండలం ఎమ్మార్వో గోపాల్, ఎస్ హెచ్ ఓ కందుకూరు వెంకటేశ్వర్లు, ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ నరేశ్, కందుకూరు , బాలాపూర్, మహేశ్వరం డి టి లు శేఖర్, క్రాంతి కుమార్, సంతోష్ లు మరియు బి ఎల్ ఓ లు సూపెర్వైసోర్స్ , అన్ని కార్యాలయాల సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం

- బూత్ లెవల్ ఏజెంట్ల బూత్ లెవెల్ అధికారుల అవగాహనా సమావేశం నిర్వహించిన బడంగ్‌పేట్ డిప్యూటీ కమిషనర్ ఏఈఆర్ఓ సమ్మయ్య



మహేశ్వరం, బడంగ్ పేట, జూన్ 23,(ప్రజా కలం)

ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) కార్యక్రమంలో భాగంగా 25-06-2026 నుండి ప్రారంభమయ్యే ఇంటింటి సర్వే (హౌస్ టూ హౌస్ ఏనుమేరేషన్ ) కార్యక్రమానికి సంబంధించి బూత్ లెవల్ అధికారులకు (బి ఎల్ ఓ ), బూత్ లెవల్ ఏజెంట్ల బడంగ్‌పేట్ సర్కిల్-16 కార్యాలయంలో ఎదురుగా ఉన్న ప్రజాభవన్‌లో మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ఓటరు జాబితా మ్యాపింగ్, ప్రోజెనీ మ్యాపింగ్, ఇంటింటి సర్వే, అర్హులైన ఓటర్ల గుర్తింపు, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన, వలస వెళ్లిన మరియు డూప్లికేట్ ఓటర్ల వివరాల పరిశీలన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఖచ్చితమైన మరియు పారదర్శకమైన ఓటరు జాబితా తయారీలో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్రను వివరించారు.ఈ సందర్భంగా బడంగ్‌పేట్ డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య మాట్లాడుతూ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఓటర్ల ముసాయిదా జాబితా (డ్రాఫ్ట్ ఎలక్టరల్ రోల్స్ ) తయారీలో మరణించిన వారు, వలస వెళ్లిన వారిని గుర్తించడంలోనూ అలాగే ఫారం 6, 7, 8 ఓటరు దరఖాస్తులను సేకరించడంలో బీఎల్ఓ లకు సహాయ సహకారాలు అందిస్తూ, ఎస్ఐఆర్ ( ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియలో బీఎల్ఏ లు కీలక పాత్ర గురించి వివరించారు. అలాగే ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడంలో బీఎల్ఏ పాత్ర కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎలక్షన్ మాస్టర్ ట్రైనర్లు ప్రతాప్ రెడ్డి, సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.





## బూత్ ఏజెంట్లకు మంత్రి క్లాస్..

# తప్పుల్లేని ఓటర్ లిస్ట్ మస్ట్

- అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయడమే లక్ష్యం
- అందోల్‌లో ఎస్ఐఆర్ పై శిక్షణ శిబిరం
- డూప్లికేట్ ఓట్లు తొలగించి, తప్పుల్లేని జాబితా రూపొందించాలి
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి ప్రతినిధి జూన్ 23( ప్రజా కలం): "ఓటరు జాబితా సవరణ కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు, ఇది ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసే బాధ్యత" అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా మంగళవారం సంగుపేట చౌరస్తాలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో అందోల్ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజెంట్స్ లతో నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని బిఎల్ఏ లకు మంత్రి సూచించారు. "చనిపోయిన వారి పేర్లు, డూప్లికేట్ ఓట్లు తొలగించాలి. అడ్రస్ మారిన వారి వివరాలు సరిచేయాలి. అర్హత ఉన్న ఒక్క పౌరుడు కూడా జాబితాలో లేకుండా పోకూడదు'' అని మంత్రి దామోదర్ రాజనర్సింహ బిఎల్ఏ లకు పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, బాధ్యతగా నిర్వహించాలని ఆయన నొక్కి చెప్పారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే డా. సంజీవ రెడ్డి, టిజిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, డిసిసి ప్రెసిడెంట్, కాటా శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జలదిగ్బంధంలో బీరంగూడ





**బీరంగూడలో వరద కల్లోలం**
**నీట మునిగిన అపార్ట్మెంట్లు**
**వాహనాలకు భారీ నష్టం**
**స్పందించని యంత్రాంగం!**

పటాన్‌చేరు, జూన్ 23 (ప్రజా కలం) ప్రతినిధి

ఒక్క రాత్రి కురిసిన భారీ వర్షం బీరంగూడ డివిజన్‌లోని అపార్ట్మెంట్ నివాసితులకు చుక్కలు చూపించింది. వర్షపు నీటి పారుదల వ్యవస్థ సరిగా లేకపోవడం, కాలువలు నిర్లక్ష్యానికి గురికావడంతో నవ్య ఫ్రైడ్ అపార్ట్మెంట్, గురు అపార్ట్మెంట్‌లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అపార్ట్మెంట్ల భూగర్భ పార్కింగ్ ప్రాంతాల్లోకి భారీగా వర్షపు నీరు చేరడంతో వాహనాలు నీటిలో మునిగిపోయి నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నవ్య ఫ్రైడ్ అపార్ట్మెంట్ భూగర్భ పార్కింగ్ ప్రాంతం పూర్తిగా నీటితో నిండిపోవడంతో అక్కడ పార్క్ చేసిన 20కి పైగా ద్విచక్ర వాహనాలు, పలువురు నివాసితుల కార్లు నీటిలో మునిగిపోయాయి. అర్ధరాత్రి సమయంలో నీరు వేగంగా చేరడంతో వాహనాలను బయటకు తీసే అవకాశం కూడా లేకపోయిందని బాధితులు తెలిపారు. నీటి కారణంగా వాహనాల ఇంజిన్లు, విద్యుత్ వ్యవస్థలు దెబ్బతిని భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక గురు అపార్ట్మెంట్‌లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. అపార్ట్మెంట్ సెల్లార్‌లోకి భారీగా వరద నీరు చేరడంతో సుమారు 30 కార్లు నీటిలో చిక్కుకున్నాయి. అనేక కుటుంబాలు రాత్రంతా భయాందోళనల మధ్య గడిపాయి. చిన్నారులు, వృద్ధులు ఇళ్లలోనే ఇరుక్కుపోయి తీవ్ర ఇబ్బందులు పడ్డారని స్థానికులు తెలిపారుసమస్యను వెంటనే జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన స్పందన రాలేదని నివాసితులు ఆరోపించారు. జీహెచ్ఎంసీ వాహనం వచ్చినప్పటికీ అందులో డీజిల్ లేకపోవడంతో స్థానికులే తమ సొంత డబ్బులతో డీజిల్ పోయించాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పన్నుల డబ్బులతో నడిచే వ్యవస్థ ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమని మండిపడ్డారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు విమర్శించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాలువల విస్తరణ, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, నీటి పారుదల మార్గాల అభివృద్ధి వంటి చర్యలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. మరో భారీ వర్షం కురిస్తే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.. వర్షం వస్తే భయం, నీరు వస్తే నష్టంఅనే పరిస్థితిబీరంగూడ అపార్ట్మెంట్ వాసుల జీవితాల్లో నిత్యకృత్యంగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

# ఇక్రిసాట్‌లో పనులకు గ్రీన్ సిగ్నల్..

### ఇక్రిసాట్‌కు అభివృద్ధి ఎమ్మెల్యే హామీ – నెలలో రోడ్లు, డ్రైనేజీ పనులు.

అమీన్పూర్, జూన్ 23 (ప్రజా కలం) ప్రతినిధి

బీరంగూడ డివిజన్ పరిధిలోని ఇక్రిసాట్ ఫేజ్-1 కాలనీలో ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి అడుగులు పడుతున్నాయి. అంతర్గత రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు నిధులు కేటాయించి, నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం ఉదయం వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే స్థానికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ప్రధానంగా అంతర్గత సీసీ రహదారులు, నూతన మురుగునీటి కాలువలు, తాగునీటి పైపుల ఏర్పాటు చేయాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కాలనీ పరిధిలో కొత్త రహదారులు, డ్రైనేజీ పైపులైన్, తాగునీటి పైపుల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చే నెల రోజుల్లో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కమ్యూనిటీ భవనం అంశాన్ని కూడా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు నరసింహ గౌడ్, అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్ సురేష్, జలమండలి ప్రధాన నిర్వాహకుడు శ్రీనివాస్ రెడ్డి, ఉప ఇంజనీర్ వెంకట రమణ, ఉప ప్రధాన నిర్వాహకుడు శివకుమార్, మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు..



# కంటోన్మెంట్ ఎస్ఐఆర్ అవగాహన సదస్సు రసాభాస!

### బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య తీవ్ర వాగ్వివాదం – ఓట్ల తొలగింపుపై పరస్పర ఆరోపణలు – చేతులేత్తిసిన బోర్డు సీఈఓ,అధికారులు



కంటోన్మెంట్, జూన్ 23:ప్రజా కలం: కంటోన్మెంట్ అధికారులు స్థానికంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతల నడుమ రసాభాసగా ముగిసింది. ఓటర్ల జాబితా సవరణ, ఓట్ల తొలగింపు అంశాలపై అవగాహన కల్పించేందుకు అధికారులు ఏర్పాటు చేసిన ఈ సమావేశం రాజకీయ రంగు పులుముకుంది. కార్యక్రమంలో పాల్గొన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ నాయకుల మధ్య ఒక్కసారిగా తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకోవడంతో సదస్సు కాస్త రణరంగంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా అర్హులైన వారి ఓట్లను తొలగించడం ఎంతమాత్రం సరికాదని ఒక వర్గం నేతలు ఆగ్రహం వ్యక్తం చేయగా.. స్థానికంగా ఒక రాజకీయ పార్టీకి లబ్ధి చేకూర్చేందుకే ఈ తొలగింపుల పర్వం సాగుతోందని మరో వర్గం నేతలు బాహాటంగా ఆరోపణలు గుప్పించారు. ఇరుపక్షాల నేతలు ఒకరిపైకొకరు సవాళ్లు విసురుకుంటూ, కేకలు వేయడంతో సమావేశంలో తీవ్ర గందరగోళం నెలకొంది. రాజకీయ నాయకుల వాదనలు, సవాళ్లతో ఏం చేయాలో పాలుపోక అధికారులు తలపట్టుకున్నారు. నేతలు అడిగిన ప్రశ్నలకు, సవాళ్లకు సమాధానం చెప్పలేక అధికారులు చేతులెత్తేశారు. కంటోన్మెంట్ బోర్డు సీఈఓ నేతృత్వంలో ఈ ప్రక్రియ ముమ్మందు ఎలా సాగుతుందో, రాబోయే రోజుల్లో ఈ అవగాహన కార్యక్రమాలను అధికారులు ఎలా పూర్తి చేస్తారోననే అనుమానాలు ఇప్పుడు తెరమీదికి వస్తున్నాయి. రాజకీయ వర్గాల ఈ ఘర్షణ వాతావరణం కంటోన్మెంట్ పరిధిలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# సిగాచి విషాదం..మళ్లీ తెరపైకి..




పటాన్‌చెరు, జూన్ 23(ప్రజా కలం) ప్రతినిధి

సిగాచి పరిశ్రమ పేలుడు ఘటన జరిగి ఏడాది పూర్తవుతున్నా బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరగలేదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన పూర్తి పరిహారం ఇప్పటికీ అందలేదని, బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని విమర్శించారు. పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్, ఇస్నాపూర్ చైర్మన్ శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ పేలుడు ఘటనలో 54 మంది మృతి చెందగా, మరో ఎనిమిది మంది ఆచూకీ ఇప్పటికీ తెలియలేదన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.కోటి పరిహారం హామీ అమలు కాకుండా కేవలం రూ.25 లక్షలు మాత్రమే అందించారని ఆరోపించారు

బాధిత కుటుంబాలకు పూర్తి పరిహారం వెంటనే చెల్లించాలని, లేకుంటే తీవ్ర ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు జూన్ 30న బాధితులతో సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో మృత కార్మికులకు నివాళులర్పించి, బాధిత కుటుంబాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. అలాగే ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## స్టేషన్ బెయిల్ కోసం

# రూ.లక్ష లంచం డిమాండ్

### రూ.50 వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన గాంధీనగర్ ఎస్ఐ



సికింద్రాబాద్ : జూన్ 23:ప్రజా కలం ప్రతినిధి:

స్టేషన్ బెయిల్ మంజూరు చేసేందుకు ఓ నిందితుడి నుంచి లక్ష రూపాయల లంచం డిమాండ్ చేసి, చివరకు యాభై వేల రూపాయలు తీసుకుంటుండగా గాంధీనగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) నర్సింహులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఓ కేసుకు సంబంధించిన నిందితుడికి స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో పాటు, భవిష్యత్తులో కేసు విషయంలో ఎలాంటి ఒత్తిడి లేకుండా చూసుకుంటానని ఎస్ఐ నర్సింహులు నమ్మబలికాడు. ఇందుకు ప్రతిఫలంగా లక్ష రూపాయల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అంత పెద్ద మొత్తాన్ని ఇచ్చుకోలేని బాధితుడు (నిందితుడు) యాభై వేల రూపాయలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకుని, ఎస్ఐ అక్రమ వసూళ్లపై నిశ్శబ్దంగా ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో పక్కా వ్యూహంతో నిఘా పెట్టారు. ఎస్ఐ నర్సింహులు తన అధికార హోదాను దుర్వినియోగం చేస్తూ బాధితుడి నుంచి రూ. 50,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి లంచం డబ్బులతో సహా పట్టుకున్నారు. ఎస్ఐని తక్షణమే అరెస్టు చేసిన అధికారులు, ఆయనను రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన స్థానిక పోలీస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

## గజ్వేల్ పట్టణ మండల అధ్యక్షులకు ఘన సన్మానం

### – పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి పిలుపు



గజ్వేల్:23 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి ) నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు వంటేరు కొండల్ రెడ్డి,గజ్వేల్ మండల అధ్యక్షుడు సుఖేందర్ రెడ్డి లను సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు తూముకుంట ఆంక్ష రెడ్డి వారికి ఘన సన్మానం చేసారు. ఈ సందర్భంగా ఆంక్ష రెడ్డి నూతన అధ్యక్షులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో పార్టీ అధిష్ఠానం యువ నాయకత్వానికి ప్రాధాన్యత కల్పించిందన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వంటేరు కొండల్ రెడ్డి,సుఖేందర్ రెడ్డి లు అంకితభావంతో పనిచేస్తూ పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు.

గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలని వారు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీని మరింత ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతన అధ్యక్షులు వంటేరు కొండల్ రెడ్డి, సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్తతో కలిసి పనిచేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్,కోమటిబండ సర్పంచ్ అమరేందర్,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మ్యాకల కనకయ్య ముదిరాజ్ జన్మదిన వేడుకలు

గజ్వేల్ నియోజకవర్గం: 23 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)



సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ జన్మదినం సందర్భంగా వారి అభిమానుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు,ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు పాములపర్తి కరుణాకర్ మాట్లాడుతూ, రాజకీయ వ్యాపార రంగంలో రాణిస్తూ సమాజ సేవలో ముందు వరుసలో ఉంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న మ్యాకల కనకయ్య ముదిరాజ్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ భవాని బాలకిషన్, ఉప సర్పంచ్ సుధాకర్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పిట్ల మహేష్, నీరుడి రాజు, చెక్కల స్వామి, మ్యాకల రాజు, దుర్గేశ్,బాలరాజు,చంద్ర శేఖర్,రవీందర్, ఎల్లం, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రజల నిరసన

## మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా

గజ్వేల్:23 జూన్
( ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో విలీనమైన మల్లన్న సాగర్ ముంపు గ్రామాల ప్రజలను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ, ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్వాసితులు మున్సిపల్ కార్యాలయం ముందు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. నిర్వాసితుల న్యాయమైన పోరాటానికి మద్దతుగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు, దామరంచ ప్రతాప్ రెడ్డి, పెద్ది బాలకిషన్, చింత కింది కనకయ్య, గూడూరి రాములు, నిర్వాసితుల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రాజెక్టుల కోసం సర్వస్వం త్యాగం చేసిన ముంపు గ్రామాల ప్రజల పట్ల ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు సానుభూతితో వ్యవహరించాలని కోరారు. మున్సిపాలిటీలో విలీనమైన ముంపు గ్రామాల ప్రజలకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పరిహారం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థిరమైన



ఉపాధి అవకాశాలు లేక, పరిహారం అందక నిర్వాసితులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నిర్వాసితులు తమ అవసరాల కోసం కట్టుకుంటున్న ఇళ్లను, ఇతర నిర్మాణాలను అధికారులు కూల్చివేయడం అత్యంత అమానుష చర్య అని నాయకులు మండిపడ్డారు.

నిర్వాసితుల త్యాగాల వల్లనే ఈరోజు తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందనే నిజాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. గ్రామాలను ఖాళీ చేసే సమయంలో ఈ ప్రాంతాలను పంచాయతీలుగానే కొనసాగిస్తామని, ఒకవేళ మున్సిపాలిటీలో విలీనం చేస్తే 10 సంవత్సరాల వరకు పన్ను మినహాయింపు కల్పిస్తామని అప్పటి ప్రభుత్వం మౌఖికంగా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.

అయితే ఈ లోపే ప్రభుత్వం మారడంతో నిర్వాసితులు అన్యాయానికి గురయ్యారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మరియు మున్సిపల్ యంత్రాంగం మానవతా దృక్పథంతో ఆలోచించి, విలీన గ్రామాల ప్రజలకు కనీసం 5 నుండి 10 సంవత్సరాల వరకు ఆస్తి పన్ను మినహాయింపు కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులు నివాస గృహాలు నిర్మించుకునేందుకు ప్రత్యేక నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని వెంటనే విడుదల చేసి వారి జీవనోపాధికి పూర్తి భరోసా కల్పించాలని నాయకులు సవినయంగా ప్రార్థించారు. లేనిపక్షంలో నిర్వాసితుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముంపు గ్రామాల బాధితులు, ఆర్ అండ్ ఆర్ కాలనీ నివాసితులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పుట్టుకతోనే కిడ్నీ సమస్యతో బాధపడుతున్న నెల వయసున్న చిన్నారికి రోబోటిక్ పైలోప్లాస్టీ సర్జరీని విజయవంతం




**కర్నూలు, ఆంధ్రప్రదేశ్, జూన్ 23 (ప్రజాకలం) :**

యశోద హాస్పిటల్స్ యూరాలజీ విభాగం వైద్యులు, కిడ్నీ పనితీరు తగ్గిపోయి, హైడ్రోనెఫ్రోసిస్ (ఎణచీ) తో పాటు లెఫ్ట్ పెల్వి-యురేటెరిక్ జంక్షన్ అబ్‌స్ట్రక్షన్ (ౖాఖజీూ) అనే కిడ్నీ సమస్యతో బాధపడుతున్న నెల వయసున్న మగ శిశువుకు అత్యంత క్లిష్టమైన రోబోటిక్-అసిస్టెడ్ పైలోప్లాస్టీ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు.

కిడ్నీ మరియు మూత్రనాళం కలిసే చోట అడ్డంకి ఏర్పడటం వల్ల మూత్రం సరిగ్గా బయటకు రాక, కిడ్నీ వాపుకు గురైన స్థితిలో శిశువును హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. దీనివల్ల కిడ్నీ పనితీరు కూడా దెబ్బతింది. సర్జరీకి ముందు క్షుణ్ణంగా పరీక్షించిన తర్వాత, మే 7, 2026 న నిపుణులైన యూరాలజీ బృందం జనరల్ అనస్థీషియా ఇచ్చి చిన్నారికి రోబోటిక్ లెఫ్ట్ పైలోప్లాస్టీ సర్జరీని నిర్వహించారు.

ఈ మినిమల్లీ ఇన్వేసివ్ రోబోటిక్ విధానంలో, మూత్రం వెళ్లే దారిలో అడ్డుపడిన ఇరుకైన భాగాన్ని తొలగించి, డీజే (ణజీ) స్టెంట్ పై అత్యంత కచ్చితత్వంతో మూత్రం సాఫీగా బయటకు వెళ్లేలా దారిని పునర్నిర్మించారు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా సర్జరీ విజయవంతంగా పూర్తయింది, అలాగే ఆపరేషన్ తర్వాత చిన్నారి చాలా త్వరగా కోలుకున్నాడు.

ఈ కేసు గురించి హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ డాక్టర్. మల్లికార్జున రెడ్డి ఎన్ (సీనియర్ కన్సల్టెంట్ యూరాలజీ ఛ రోబోటిక్ సర్జన్, మరియు క్లినికల్ డైరెక్టర్) మాట్లాడుతూ, “పుట్టుకతో వచ్చే ౖాఖజీూ అనేది శిశువులలో మూత్ర విసర్జనకు అడ్డంకిగా మారే అత్యంత సాధారణ కారణాలలో ఒకటి. దీనికి చికిత్స చేయకుండా వదిలేస్తే, క్రమంగా కిడ్నీ పనితీరు దెబ్బతింటుంది. చాలా చిన్న వయసు పిల్లల్లో కూడా ఈ రోబోటిక్-అసిస్టెడ్ పైలోప్లాస్టీ సర్జరీ ఎంతో కచ్చితత్వంతో పాటు, చిన్న కోతలు, తక్కువ రక్తస్రావం, తక్కువ నొప్పి మరియు త్వరగా కోలుకునేలా చేస్తుంది. ముందస్తుగా వ్యాధిని గుర్తించడం మరియు సకాలంలో చికిత్స అందించడం ద్వారా కిడ్నీ పనితీరును కాపాడవచ్చు మరియు అలాంటి పిల్లలు ఆరోగ్యంగా పెరిగేలా చేయవచ్చు” అని వివరించారు.

అంతే కాకుండా , “ఈ నెల వయసున్న శిశువుకు విజయవంతంగా చికిత్స అందించడం అనేది పీడియాట్రిక్ రోబోటిక్ యూరాలజీలో వస్తున్న ఆధునిక పురోగతిని, అలాగే అత్యాధునిక టెక్నాలజీతో పుట్టుకతో వచ్చే అత్యంత క్లిష్టమైన యూరాలజీ సమస్యలను పరిష్కరించడంలో యశోద హాస్పిటల్స్‌కు ఉన్న నైపుణ్యాన్ని తెలియజేస్తుంది” అని అన్నారు.

హాస్పిటల్‌లో ఉన్నన్ని రోజులు చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆరు వారాల తర్వాత స్టెంట్‌ను తొలగించడానికి మరల ఫాలో-అప్‌కు రావాలని వైద్యులు సూచించి, శిశువును పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జ్ చేశారు.

యశోద హాస్పిటల్స్ లోని యూరాలజీ విభాగం, అత్యాధునిక టెక్నాలజీ మరియు మల్టీడిసిప్లినరీ విధానంతో పెద్దలు మరియు చిన్నపిల్లల యూరాలజీ సమస్యలకు అత్యుత్తమ రోబోటిక్ మరియు మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీ సేవలను అందిస్తుంది.

# డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

**: గజ్వేల్ సీఐ రవికుమార్**

**అక్కారం గ్రామంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం**




గజ్వేల్ :23 జూన్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ మండలంలోని అక్కారం గ్రామంలో డ్రగ్స్ రహిత తెలంగాణ కార్యక్రమాన్ని తెలంగాణ లీగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో గజ్వేల్ సీఐ రవికుమార్, పోలీసు సిబ్బంది నిర్వహించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా గజ్వేల్ సీఐ రవికుమార్ మాట్లాడుతూ, గ్రామీణ యువతలో మాదకద్రవ్యాలపై అవగాహన పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే అక్కారం గ్రామంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు.డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణమే తమ లక్ష్యమని పేర్కొన్న ఆయన, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటంలో కుటుంబ సభ్యులు, మహిళలు, సమాజంలోని ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని అన్నారు. యువత విలువైన జీవితాలను నాశనం చేసే మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.తెలంగాణ లీగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో నిరంతరం డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ఒలింపిక్ అసోసియేషన్ తరఫున నిర్వహించిన రన్ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందని పేర్కొన్నారు.డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వారు 1908 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఫోన్ చేయడం సాధ్యం కాని పరిస్థితుల్లో సంబంధిత వాట్సాప్ నంబర్‌కు సందేశం పంపి సమాచారాన్ని అందించవచ్చు న్నారు.సమాజం మొత్తం కలిసి పనిచేస్తే యువత జీవితాలను మాదకద్రవ్యాల ముప్పు నుంచి కాపాడగలమని సీఐ రవికుమార్ పేర్కొన్నారు.

# గజ్వేల్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సీపీ రష్మీ పెరుమాళ్

**రికార్డుల నిర్వహణలో 5ఎస్ విధానం పాటించాలి**

**పెండింగ్ కేసులపై సమీక్ష.. రికార్డుల నిర్వహణపై కీలక సూచనలు**




గజ్వేల్:23 జూన్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

వార్షిక తనిఖీలలో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్, మంగళవారం గజ్వేల్ ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ రికార్డులు, కేసు ఫైళ్లు, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు.ప్రస్తుతం విచారణలో ఉన్న కేసుల పురోగతి, వాటి స్థితిగతులు, కార్యాలయ ప్రాంగణం పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గజ్వేల్ ఏసీపీ నర్సింలుకు పలు కీలక సూచనలు చేశారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పోక్సో కేసులు, ఇతర తీవ్రమైన నేరాలకు సంబంధించిన దర్యాప్తును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యాలయంలోని అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. అలాగే కార్యాలయ నిర్వహణలో తప్పనిసరిగా ‘5ఎస్’ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఫిర్యాదుదారుతో ఓపికగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని, బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించి సంబంధిత సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు, గజ్వేల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



**ఖమ్మం, జూన్ 23 (ప్రజాకలం) :**

ఈ నెల 28న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం పోస్టర్‌ను స్థానిక ఎన్7 స్టూడియోస్‌లో తెలంగాణ ఉద్యమ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిడమర్తి రవి, డాక్టర్ కె.వి. కృష్ణారావు, నందిగామ రాజ్‌కుమార్ జానీ, బొబ్బిలి భరత్ చంద్ర, వేల్పుల మురళీ, విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటికీ, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అనేక మంది ఇప్పటికీ పలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల గౌరవ పెన్షన్, ప్రత్యేక ఆరోగ్య బీమా, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ప్రత్యేక కోటా, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన, ఉద్యమకారుల గౌరవ పరిరక్షణ, హక్కుల సాధనే సమ్మేళనం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, విద్యార్థి నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి: రామచంద్రరావు





**మెదక్, జూన్ 24 (ప్రజాకలం) :**

బీజేపీ మెదక్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా నియమితులైన పట్లోళ మల్లిక అశోక్ బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర అధ్యక్షుడు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. మహిళా మోర్చా కమిటీలను మరింత చురుకుగా నిర్వహిస్తూ, విస్తృత స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.

అనంతరం బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి చీకోటి ప్రవీణ్ మల్లిక అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సోషల్ మీడియా పాత్ర కీలకమని ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిసింది. పార్టీ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేస్తానని మల్లిక అశోక్ పేర్కొన్నారు.




# అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సరికొత్త ప్రపంచ రికార్డు ప్రయత్నం పోస్టర్ ఆవిష్కరణ

**హైద్రాబాద్ జూన్ 23(ప్రజాకలం న్యూస్)**

ఖైరతాబాద్ అడిషనల్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈ నెల 26న జరగనున్న సరికొత్త ప్రపంచ రికార్డు ప్రయత్నానికి సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని ఖైరతాబాద్ ఏడీసీపీ ఆనంద్ అంద చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 26న నిర్వహించే అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యువతలో అవగాహన కల్పించేందుకు జివిఆర్ కరాటే అకాడమీ చేపడుతున్న ఈ ప్రపంచ రికార్డు ప్రయత్నం అభినందనీయమని అన్నారు. ప్రస్తుతం యువతలో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ వంటి సానుకూల కార్యక్రమాల ద్వారా యువతను సరైన మార్గంలో నడిపించడం అవసరమని పేర్కొన్నారు. జూన్ 26న ఉదయం హైద్రాబాద్ నారాయణగూడలోని జివిఆర్ కరాటే అకాడమీలో డాక్టర్ జి.ఎస్.గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో కేవలం 26 సెకన్లలో 6 మంది విద్యార్థుల తలలపై ఉంచిన 26 ఆపిల్స్‌ను హ్యాండ్ చాప్ స్ట్రైక్ ద్వారా పగలగొట్టి సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పనున్నట్లు తెలిపారు. ఈ వినూత్న ప్రదర్శన వేగం,కచ్చితత్వం, ధైర్యసాహసాలు కరాటే నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తుందని చెప్పారు. ఈ ప్రపంచ రికార్డు ప్రయత్నంలో విద్యార్థులు భార్గవ్ సాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి,చిన్మయి ప్రియ పాల్గొననున్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన జీవనశైలి సామాజిక బాధ్యతను పెంపొందించే దిశగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం, జూన్ 26న జరిగే ప్రపంచ రికార్డు ప్రయత్నానికి అధికారిక పరిశీలకుడిగా అఫిషియల్ అబ్జర్వర్ బింగి నరేందర్ గౌడ్ హాజరై రికార్డు ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.






# టాక్సీ డ్రైవర్ల సమస్యలు తీర్చాలి

## తెలంగాణ టాక్స్ డ్రైవర్ల అధ్యక్షుడు శివప్రసాద్

## ఘనంగా తెలంగాణ టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ మొదటి వార్షికోత్సవ వేడుకలు







శంషాబాద్ జూన్ 23, (ప్రజా కలం)

తెలంగాణ టాక్సీ డ్రైవర్ల సమస్యలు తీర్చాలని ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్ తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ టాక్సీ మరియు ఓనర్స్ అసోసియేషన్ (టీజీటీడీఏ) మొదటి వార్షికోత్సవ వేడుకలు శంషాబాద్లోని ఓ గార్డెన్ లో మంగళవారం జరిగాయి. ఈ సమావేశానికి దేశంలోని దక్షణాదిరాష్ట్రాలకు చెందిన టాక్సీడైవర్ మరియు ఓనర్ల అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన టాక్సీ డైవర్లను అసోసియేషన్ సభ్యులు తలపాగ, పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీజీటీడీఏ తెలంగాణ అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ టాక్సీ డైవర్ల మద్య వైట్ నెంబర్ ప్లేట్ల పంచాయతీ ఎక్కువగా ఉందన్నారు. కర్ణాటక, తమిళనాడు, మహరాష్ట్రలకు చెందిన టాక్సీ డ్రైవర తెలంగాణ రాష్ట్రంలో టాక్స్ కట్టకుండా వ్యాపారం చేసుకుంటూ తెలంగాణ రాష్ట్రానికి ఎంతో నష్టం కలిగిస్తున్నారన్నారు. అందుకే దక్షణాదికి చెందిన ఆరు రాష్ట్రాల డ్రైవర్ల అసోసియేషన్లతో సమావేశం నిర్వహిస్తున్నావరు. సమస్యను పరిష్కరించేదిశగా చర్చలు జరుపుతున్నట్టు తెలిపారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి తెలంగాణకు వస్తున్న వాహనాలకు స్టిక్కర్ చేసి పంపిస్తున్నారన్నారు. తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్ వెళ్తే రూ.3.500 టాక్స్ వేస్తున్నారని వాపోయారు. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇతరరాష్ట్రాలకు వెళ్తే ఒక న్యాయం అదే తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్తే ఒక న్యాయమా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం టాక్సీ డ్రైవర్లకు ఉచితంగా ఇన్సూరెన్సు చేయించాలని, డ్రైవర్ల కుటుంబాల పిల్లలకు స్కూల్ సౌకర్యం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన ట్రాన్స్ జెండర్ గత మూడు సంవ్సరాల నుంచి దక్షణాది రాష్ట్రాల్లో టాక్సీ నడుపుతూ జీవనం సాగిస్తుందని కొనియాడుతూ ఆమెను సన్మాణించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నరసింహా చారీ, ఉపాధ్యక్షులు నాగుల రమేష్, మహేశ్, కిరణ్, పాలమాకుల విజయ్, రణధీర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టానుసారంగా యూరియా అమ్మకాలు

## - చూసి,చూడనట్లు వ్యవహరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

## - పిఎసిఎస్ లో ఒకలా, ఫెర్టిలైజర్ షాపులలో మరోలా..

వలిగొండ జూన్ 23 ప్రజాకలం:యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో ఇష్టానుసారంగా యూరియా అమ్మకాలు జరుగుతున్నాయి. యూరియా అధిక ధరలపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. వలిగొండ మండలంలోని నాగారం గ్రామంలో ఉన్న శ్రీనివాస ట్రేడర్స్ తో పాటు మండల కేంద్రంలోని మరి కొన్ని షాపు లు యూరియా బ్యాగ్ పై ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.266 కాగా,హమాలీ 10 రూపాయలతో కలిపి 277 రూపాయలు తీసుకోవాలి. కానీ ఇందుకు భిన్నంగా దుకాణంలో మాత్రం రూ.320 వసూలు చేస్తున్నారని,రైతులు ఆరోపించారు. ఇందుకు ఒక రైతు 5 బస్తాలకు గాను 1600 రూపాయలు చెల్లించినట్లు తెలిపారు. అదనంగా బస్తాకు 40 రూపాయలు ఎక్కువ తీసుకుంటున్నట్లు రైతులు ఆరోపించారు. అధిక ధరల వసూళ్లతో పేద రైతులకు తీవ్రమైన భారం పడుతోందని,ఆవేదన వ్యక్తం చేశారు. సాగు సీజన్లో ఎరువుల కోసం ఎదురుచూస్తున్న రైతులు ఇలాంటివి ఎదుర్కోవడం బాధాకరమని అన్నారు. అధికారులు తరచూ ధరల నియంత్రణపై మాట్లాడుతున్నప్పటికీ,నేల మీద పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు. అనుమతులు ఉన్న దుకాణాల్లోనే ఇలా అధిక ధరలు వసూలు చేస్తే, రైతులకు నిజంగా రక్షణ ఎవరు అందిస్తారని ప్రశ్నించారు. ఈ ఘటనపై వెంటనే అధికారులు స్పందించి,దుకాణంపై తనిఖీలు జరిపి,రైతులను దోపిడి చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు వ్యవసాయ శాఖ అధికారులను కోరుతున్నారు.




# ప్రగతినగర్‌కు వరద ముప్పు

## - హైడ్రాను ఆశ్రయించిన కాలనీ ప్రతినిధులు

నిజాంపేట్, ప్రజాకలం:

మియాపూర్ – గండిమైసమ్మను కలుపుతూ నిర్మిస్తున్న 6 లైన్ల రహదారి ప్రధాన వరద కాలువలను ప్రగతినగర్ కమాన్ వద్ద చిన్న పైపులకు అనుసంధానం చేయడంపై స్థానిక నివాసితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'హైడ్రా' కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు తుమ్మేటి శరత్ రెడ్డి, వడ్లకొండ సందీప్ తదితరులు హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌ను స్వయంగా కలిసి ఈ విషయమై ఒక వినతిపత్రం సమర్పించారు.

?రహదారికి ఇరువైపులా నిర్మిస్తున్న 1200 ఎంఎం చొప్పున మొత్తం 2400 ఎంఎం సామర్థ్యం గల భారీ వరద కాలువలను, ప్రగతినగర్‌లోని కేవలం 200 ఎంఎం చిన్న పైపులకు అనుసంధానం చేయడం వల్ల భవిష్యత్తులో కాలనీలకు తీవ్ర వరద ముప్పు సంభవిస్తుందని కమిషనర్ రంగనాథ్‌కు కాలనీ సభ్యులు క్షేత్రస్థాయి పరిస్థితిని వివరించారు. ఈ వరద నీరంతా నివాస ప్రాంతాల్లోకి రాకుండా నేరుగా చెరువుకు చేరేలా చర్యలు తీసుకోవాలని, లోపభూయిష్టంగా ఉన్న ఇంజనీరింగ్ పనులను సరిదిద్ది సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన హైడ్రా కమిషనర్, ఈ సమస్యను తక్షణమే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కాలనీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.









Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaih Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com